

విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ అమ్మవారు నాల్గో రోజూ మహా చండీ దేవిగా దర్శనం ఇస్తారు.


ప్రజా గళమే

# స్పంద

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame

సత్యానికి స్వరం

SPANDA N.E.W.S.

APMUL/26/A3106

National Telugu Daily Newspaper

బుధవారం || 14-10-2026 || సంపుటి: 1 || సంచిక: 70 || పేజీలు: 8 || వెల : రూ.5/-

Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal







## నీట్ పేపర్ లీకేజీలకు చెక్ పడాల్సిందే!

- ఒకే ప్రశ్నపత్రం విధానానికి స్వస్తి పలకాలి
- పరీక్ష ప్రారంభానికి నిమిషాల ముందే ప్రశ్నపత్రం సిద్ధం చేయాలి
- భారీ ప్రశ్నల నిధితో అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు
- పరీక్షల వ్యవస్థలో సమూల మార్పులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని సూచనలు

4



## ప్రజాస్వామ్య రక్షణకు కలిసికట్టుగా పోరాడుతాం

- ఇండియా కూటమి భేటీలో రాహుల్ గాంధీ పిలుపు!
- రాహుల్ నివాసంలో ఇండియా కూటమి నేతల కీలక భేటీ
- ఓటర్ల జాబితాల సవరణ, ఓట్ల తొలగింపుపై చర్చ
- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు

4



## అధికారం అజమాయిషీకి కాదు..

- ప్రజలను నియంత్రించడం కాదు.. అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సాంకేతికత, సమాచారం, ఆవిష్కరణల ఫలాలు అందరికీ అందాలి
- పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

4



# అందరికీ నమస్కారం





- తెలుగులో అదరగొట్టిన సీఎం విజయ్!
- విజయవాడ ఉత్సవ్‌లో ప్రత్యేక ఆకర్షణగా తమిళనాడు సీఎం ప్రసంగం
- పున్నమి ఘాట్ వేదికగా చంద్రబాబు, విజయ్ సందడి
- తెలుగులో పలకరించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న విజయ్
- నదుల అనుసంధానంపై చంద్రబాబుతో కీలక చర్చలు
- ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న తమిళనాడు సీఎం
- గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలికిన మంత్రి నారాయణ

విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ సీజన్-2' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేదికగా తమిళనాడు సీఎం విజయ్ 'అందరికీ నమస్కారం' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించి సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విజయవాడ ప్రజల అభిమానానికి, నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం లభించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**విజయవాడ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** 'అందరికీ నమస్కారం' అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించడంతో విజయవాడ ఉత్సవ్ వేదికపై ప్రత్యేక సందడి నెలకొంది. నగరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ రెండో సీజన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో కలిసి విజయ్ పాల్గొన్నారు. తెలుగు ప్రజలను వారి మాతృభాషలో పలకరించిన ఆయన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విజయవాడకు రావడం, ఇక్కడి ప్రజలను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ వేదికగా విజయ్ చేసిన ప్రసంగం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'అందరికీ నమస్కారం' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన తనను ఆహ్వానించిన నిర్వాహకులకు, అభిమానంతో స్వాగతించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ ప్రజల ఆతిథ్యం తనకు ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ప్రసంగం ముగింపులో

మిగతా 2 లో



# బ్యాలెట్‌కు ముందు భరోసా

- రిజర్వేషన్ల కసరత్తు పూర్తయింది..
- ఎన్నికల నోటిఫికేషన్‌పై ఎదురుచూపులు
- నామినేషన్ వేయగలిగితేనే పోటీ..
- నిర్భయంగా ఓటేస్తేనే ప్రజాతీర్పు
- కూటమికి క్షేత్రస్థాయి బలపరీక్ష..
- వైసీపీకి పునరుజ్జీవన అవకాశం
- పోలీసుల నిష్పక్షపాత వైఖరే ఎన్నికల విశ్వసనీయతకు పునాది

**అమరావతి, స్పంద పొలిటికల్ బ్యూరో :** రిజర్వేషన్‌తో సీటు దక్కొచ్చు.. రక్షణ ఉంటేనే అభ్యర్థి బరిలో నిలవగలడు. నోటిఫికేషన్‌తో ఎన్నిక మొదలవుతుంది.. నిర్భయంగా ఓటు వేయగలిగినప్పుడే ప్రజాతీర్పు వెల్లడవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక ఎన్నికల సన్నాహాలు తుది దశకు చేరుతున్న వేళ ప్రధాన చర్చ రిజర్వేషన్ల నుంచి ఎన్నికల నిర్వహణపైకి మళ్లుతోంది. ఎవరు ఎక్కడ పోటీ చేయాలన్న లెక్కలతోపాటు, పోటీకి దిగినవారు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగలరా అన్న ప్రశ్న ఉదయిస్తోంది.. అధికార కూటమికి ప్రజాదరణను అంచనా వేసుకోవడానికి, ప్రతిపక్షానికి తన బలాన్ని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు అవకాశం. ఆ అవకాశానికి అర్థం ఉండాలంటే అభ్యర్థికి భద్రత, ఓటరుకు స్వేచ్ఛ ఉండాలి. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల రిజర్వేషన్ల ఖరారు నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్‌పై ఆసక్తి పెరిగింది. మంగళవారం విజయవాడలో ఎన్నికల కమీషన్ ఏర్పాటు చేసిన పార్టీల సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, భద్రతా ఏర్పాట్లు చర్చకు వచ్చాయి.

మిగతా 2 లో



# హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో స్వామి

### వీణాధారిగా జ్ఞానప్రదాతగా దివ్యదర్శనం

**తిరుమల, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు హంస వాహనంపై వీణ ధరించి, సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. విద్య, జ్ఞానం, వివేకానికి ప్రతీకగా వీణాధారిగా అలంకృతులైన స్వామివారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగిన వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హంస జ్ఞానానికి, వివేకానికి ప్రతీకగా నిలుస్తుంది. పాలను, నీటిని వేరు చేయగలదనే సంప్రదాయ భావన వివేకశక్తిని సూచిస్తుంది. ఇది ఆత్మానాత్మ వివేచనకు సంకేతం. పరమాత్మ సాక్షాత్కారం పొందిన మహనీయులను ఉపనిషత్తులు 'పరమహంసలు'గా అభివర్ణిస్తాయి. భక్తుల్లో అహంభావాన్ని తొలగించి, జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తూ బ్రహ్మపద ప్రాప్తికి అనుగ్రహించే దివ్యవాహనంగా హంస వాహనాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయం కీర్తిస్తుంది.



## స్థానిక సమరంపై జగన్ కసరత్తు

- పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు అబ్జర్వర్లతో చర్చలు

2

## నేడు కనకదుర్గమ్మ సన్నిధికి రాష్ట్రపతి!

- ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోనున్న ద్రౌపది ముర్ము
- పర్యటనకు పటిష్ఠ భద్రత, ప్రత్యేక ఏర్పాట్లు
- దేవాదాయ శాఖ కమిషనర్ వెల్లడి

2





## త్వరలో కొత్తగా 22 డయాలసిస్ కేంద్రాలు

- రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త కేంద్రాల ఏర్పాటు
- పేదలకు ఉపశమనం-సేవల విస్తృతికి ప్రభుత్వ ప్రాధాన్యం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

2

## మడ అడవుల సంరక్షణతోనే మానవ మనుగడకు భరోసా

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు

సంగమేశ్వరంలో మడ మొక్కలు నాటిన నాగబాబు

3





## గ్రామీణాభివృద్ధికి రహదారుల బలోపేతం కీలకం

- ఆత్మకూరులో నాలుగు లేన్స్ రహదారి అభివృద్ధి
- రహదారికి వాయుపుత్ర మార్గ్ గా నామకరణం
- మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

3

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక



# బ్యాలెట్‌కు ముందు భరోసా

- రిజర్వేషన్ల కసరత్తు పూర్తయింది.. ఎన్నికల నోటిఫికేషన్‌పై ఎదురుచూపులు
- నామినేషన్ వేయగలిగితేనే పోటీ.. నిర్భయంగా ఓటేస్తేనే ప్రజాతీర్పు
- కూటమికి క్షేత్రస్థాయి బలపరీక్ష.. వైసీపీకి పునరుజ్జీవన అవకాశం
- పోలీసుల నిష్పక్షపాత వైఖరే ఎన్నికల విశ్వసనీయతకు పునాది




**అమరావతి, స్పంద పొలిటికల్ బ్యూరో :** రిజర్వేషన్‌తో సీటు దక్కొచ్చు.. రక్షణ ఉంటేనే అభ్యర్థి బరిలో నిలవగలడు. నోటిఫికేషన్‌తో ఎన్నిక మొదలవుతుంది.. నిర్భయంగా ఓటు వేయగలిగినప్పుడే ప్రజాతీర్పు వెల్లడవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక ఎన్నికల సన్నాహాలు తుది దశకు చేరుతున్న వేళ ప్రధాన చర్చ రిజర్వేషన్ల నుంచి ఎన్నికల నిర్వహణపైకి మళ్లుతోంది. ఎవరు ఎక్కడ పోటీ చేయాలన్న లెక్కలతోపాటు, పోటీకి దిగినవారు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగలరా అన్న ప్రశ్న ఉదయిస్తోంది.. అధికార కూటమికి ప్రజాదరణను అంచనా వేసుకోవడానికి, ప్రతిపక్షానికి తన బలాన్ని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు అవకాశం. ఆ అవకాశానికి అర్థం ఉండాలంటే అభ్యర్థికి భద్రత, ఓటరుకు స్వేచ్ఛ ఉండాలి.పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల రిజర్వేషన్ల ఖరారు నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్‌పై ఆసక్తి పెరిగింది. మంగళవారం విజయవాడలో ఎన్నికల కమీషన్ ఏర్పాటు చేసిన పార్టీల సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, భద్రతా ఏర్పాట్లు చర్చకు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో పోటీ వ్యక్తిగత సంబంధాలు, స్థానిక ఆధిపత్యాలు, ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉంటుంది. అందుకే పోలింగ్ రోజు భద్రతతోనే ఎన్నికల స్వేచ్ఛను నిర్ధారించలేం. నామినేషన్ పత్రాలు తెచ్చుకోవడం నుంచి వాటిని సమర్పించడం, పరిశీలన, ఉపసంహరణ వరకు ప్రతి దశలో అభ్యర్థి స్వతంత్రంగా వ్యవహరించగలగాలి. పోటీ చేయాలనుకున్న వ్యక్తి ఎన్నికల కార్యాలయానికి చేరుకోలేకపోయినా, బెదిరింపులతో వెనక్కి తగ్గినా ఓటరుకు అందుబాటులో ఉండాల్సిన ఒక ప్రత్యామ్నాయం ముందుగానే తొలగిపోయినట్లే.బెదిరింపులు, అధికార యంత్రాంగం దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తూ వైసీపీ ఇప్పటికే ఎన్నికల సంఘానికి వినతులు సమర్పించింది. జిల్లా కేంద్రాల్లో అదనపు నామినేషన్ సదుపాయం, నిరంతర భద్రతా పర్యవేక్షణ, కేంద్ర బలగాల మోహరింపు కోరింది. ఇవి ఆ పార్టీ వ్యక్తం చేసిన ఆందోళనలు, డిమాండ్లు నిర్ధారణ జరిగిన ఘటనలుగా చూడకూడదు. అయినప్పటికీ ఇటువంటి ఫిర్యాదులపై ముందస్తు చర్యలు తీసుకోవడం ఎన్నికల నిర్వహణపై విశ్వాసాన్ని పెంచుతుంది. నామినేషన్ కేంద్రాల ప్రవేశ మార్గాల్లో భద్రత, కార్యాలయాల పరిసరాల్లో సీసీ కెమెరాలు, ఫిర్యాదులకు తక్షణ స్పందన వంటి చర్యలు ఈ దశలో కీలకం. మేయర్, చైర్‌పర్సన్ స్థాయి నాయకులకే పరిమితం కాకుండా వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల భద్రతనూ పరిగణనలోకి తీసుకోవాలి. ముప్పును అంచనా వేసి రక్షణ కల్పించాలి. ఉపసంహరణ సమయంలో ఒత్తిడి జరిగిందన్న ఫిర్యాదు వస్తే వెంటనే పరిశీలించే వ్యవస్థ ఉండాలి. సహజంగా జరిగిన ఏకగ్రీవానికి, ఒత్తిడితో ఏర్పడిన ఏకగ్రీవానికి తేడాను గుర్తించగల పర్యవేక్షణ అవసరం.

### ఖాకీ వైఖరే నమ్మకానికి కొలమానం

పోలీసులు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ప్రతిపక్ష ఆరోపణలకు సమాధానం క్షేత్రస్థాయి చర్యల్లో కనిపించాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందినవారన్నది కాకుండా, ఫిర్యాదులోని తీవ్రత ఆధారంగా స్పందించాలి. అధికార పార్టీ కార్యకర్త చేసిన బెదిరింపుపైనా, ప్రతిపక్ష కార్యకర్త సృష్టించిన ఘర్షణపైనా ఒకే ప్రమాణంతో చర్యలు తీసుకుంటేనే నిష్పక్షపాత వైఖరిపై నమ్మకం ఏర్పడుతుంది.జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగం తక్కువ వ్యవధిలోనే ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సూచించినట్లు సమాచారం. ఈ సంసిద్ధతలో సిబ్బంది నియామకం, బందోబస్తుతోపాటు ఫిర్యాదుల పరిష్కారం, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు పర్యవేక్షణకు ప్రాధాన్యం అవసరం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఉపయోగకరమే అయినా, వాటి పర్యవేక్షణ, దృశ్యాల భద్రపరచడం, ఫిర్యాదు వచ్చినప్పుడు పరిశీలించడం కూడా అంతే ముఖ్యం. పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలోనే ఓటరు భయపడే పరిస్థితి ఉంటే కేంద్రం లోపల బందోబస్తు ఉన్నా పూర్తి ప్రయోజనం ఉండదు. ప్రచారం నుంచి ఓట్ల లెక్కింపు వరకు భద్రతా ప్రణాళిక కొనసాగాలి.




### కూటమికి గెలుపుతోపాటు సమన్వయ పరీక్ష

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఈ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుపై స్థానిక స్పందనను తెలుసుకునే అవకాశం. భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నట్లు టీడీపీ రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. పట్టణ స్థాయిలో ఆశావహులను సమన్వయం చేయడం, పరస్పరం ఓట్ల బదిలీ జరిగేలా చూడడం కూటమి ముందున్న రాజకీయ సవాలు. రిజర్వేషన్ మారితే అభ్యర్థి మారుతాడు. అతనితోపాటు స్థానిక వర్గాల లెక్కలు, నాయకత్వ సమీకరణాలూ మారవచ్చు. ఒక పార్టీకి కేటాయించిన వార్డులో మరో భాగస్వామ్య పార్టీకి బలమైన ఆశావహుడు ఉంటే అసంతృప్తి తలెత్తే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయి సఖ్యతను వార్డు స్థాయి సహకారంగా మార్చగలిగితేనే కూటమి బలం ఓట్లుగా మారుతుంది.అదే సమయంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు, పన్నుల భారం వంటి రోజువారీ సమస్యలు పట్టణ ఓటరి నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. పెద్ద రాజకీయ నినాదాలతోపాటు ఇంటి ముందు ఉన్న సమస్యకు అభ్యర్థి ఇచ్చే సమాధానమూ కీలకమే.

### వైసీపీకి ఆరోపణలతోపాటు అభ్యర్థుల సవాలు

వైసీపీకి ఈ ఎన్నికలు స్థానికంగా కార్యకర్తలను సమీకరించుకోవడానికి, సంస్థాగత బలాన్ని చూపడానికి అవకాశం. ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతోపాటు ప్రతి వార్డులో పోటీ చేయగల అభ్యర్థిని నిలబెట్టడం, ప్రచారాన్ని ప్రజా సమస్యల చుట్టూ నడపడం అవసరం. భద్రతపై చేసే ఫిర్యాదులను ఆధారాలతో ఎన్నికల సంఘం ముందుంచితే వాటికి మరింత బలం చేకూరుతుంది.కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నచోట దాన్ని ఓటుగా మార్చుకోవాలంటే ప్రత్యామ్నాయంపై నమ్మకం కల్పించాలి. స్థానిక సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ, ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థి ప్రతిపక్షానికి రాజకీయ అవకాశాన్ని కల్పిస్తారు. కాంగ్రెస్, వామపక్షాలు, స్వతంత్రులకూ ఇదే వర్తిస్తుంది. చిన్న పార్టీల అభ్యర్థులు సైతం స్వేచ్ఛగా బరిలో నిలవగలిగితే ఎన్నికల పోటీ విస్తరిస్తుంది.

### గెలిచిన సీట్లే మొత్తం బలం కావు

అధికార కూటమికి ఎక్కువ స్థానాలు రావడం రాజకీయ విజయం కావచ్చు. అయితే ఆ ఫలితంతో ప్రజాదరణను అంచనా వేయాలంటే పోటీ జరిగిన తీరు, పోలైన ఓట్లు, గెలుపు తేడాలు, పోలింగ్ శాతం కూడా చూడాలి. పోటీని అడ్డుకున్నారన్న వివాదాల మధ్య వచ్చిన ఫలితం క్షేత్రస్థాయి పరిస్థితిని స్పష్టంగా చెప్పదు. స్వేచ్ఛగా జరిగిన ఎన్నికలో వచ్చిన ఫలితమే ప్రభుత్వానికి ఎక్కడ ఆదరణ ఉందో, ఎక్కడ అసంతృప్తి పెరిగిందో తెలియజేస్తుంది. పట్టణ ఎన్నికల ఫలితాలు తదుపరి గ్రామీణ స్థానిక ఎన్నికలకు రాజకీయ సంకేతాలు ఇవ్వవచ్చు. అయితే పట్టణ, గ్రామీణ సమస్యలు భిన్నమైనందున వాటిని యథాతథంగా వర్తింపజేయలేం. ఎన్నికల నిర్వహణలో మాత్రం ఈ దశ ఒక ప్రమాణంగా నిలవగలదు. అభ్యర్థి నిర్భయంగా నామినేషన్ వేయడం నుంచి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేయడం వరకు భరోసా కల్పిస్తేనే-గెలిచినవారికి ప్రజామద్దతుపై స్పష్టత, ఓడినవారికి ప్రజాతీర్పుపై విశ్వాసం ఏర్పడతాయి.

# నేడు కనకదుర్గమ్మ సన్నిధికి రాష్ట్రపతి!

- ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోనున్న ముర్ము
- రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట భద్రత, ప్రత్యేక ఏర్పాట్లు
- దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ వెల్లడి

**విజయవాడ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్) :** రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ అధికారులు పటిష్టమైన అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. మంగళవారం ఇంద్రకీలాద్రి మీడియా పార్టీ వద్ద దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నాలుగో రోజైన అక్టోబర్ 14వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించినట్లు కమిషనర్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన అధికారిక సమాచారం, ఏర్పాట్ల వివరాలను దేవాదాయ శాఖ కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు.



పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శన అనుభవాన్ని కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో సమాచార శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ టి. తిమ్మప్ప, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ త్రినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ నమస్కారం

మొదటి పేజీ తరువాయి

'థాంక్యూ విజయవాడ.. మీ అభిమానానికి, నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు' అంటూ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. తన విజయవాడ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నదుల అనుసంధానం, అంతర్రాష్ట్ర జలవనరుల వినియోగానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు విజయ్ తెలిపారు. రెండు రాష్ట్రాల ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై అభిప్రాయాలు పంచుకునే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా నదుల అనుసంధానం, నీటి పంపిణీ, వ్యవసాయ అవసరాలు వంటి అంశాల నేపథ్యంలో ఇరువురు ముఖ్యమంత్రుల సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మంత్రి పొంగూరు నారాయణ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం విజయ్ తన పర్యటనలో భాగంగా విజయవాడలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను విజయ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దుర్గగుడి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. విజయవాడ ఉత్సవ్ వేదికపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనడం, విజయ్ తెలుగులో ప్రసంగించడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. మరోవైపు నదుల అనుసంధానం, జలవనరుల పంపిణీ అంశాలపై జరిగిన చర్చల నేపథ్యంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రాజకీయ, పరిపాలనాపరమైన ప్రాధాన్యం ఏర్పడింది.

# త్వరలో కొత్తగా 22 డయాలసిస్ కేంద్రాలు

### రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త కేంద్రాల ఏర్పాటు

### పేదలకు ఉపశమనం-సేవల విస్తృతికి ప్రభుత్వ ప్రాధాన్యం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం (పీఎంఎన్‌డీపీ) కింద కొత్తగా మరో 22 కేంద్రాలు త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగుల అవసరాలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పిఎంఎన్‌డిపి కింద 61 కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. వీటికి అదనంగా కొత్తగా రానున్న 22 కేంద్రాల(మొత్తం 83) ద్వారా ఉచిత డయాలసిస్ (రక్తశుద్ధి) సేవలు పేదలకు మరింత చేరువ అవుతాయని వెల్లడించారు. ఇవి కాకుండా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 170 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ రెండు పథకాల కింద ఉచితంగా అందించే డయాలసిస్ సేవల నిమిత్తం 2025-26లో రూ.197.88 కోట్లు వరకు వ్యయమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇటీవలి వరకు రూ.90.09 కోట్ల విలువైన డయాలసిస్ సేవల్ని పేద రోగులు పొందారు.

### కూటమి హయాంలో ఇప్పటివరకు 14 కొత్త కేంద్రాలు

ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద రాష్ట్రంలో 2019కు ముందు 28 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 2019-24 మధ్య 19 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. 2024-25 నుంచి మరో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా ఇప్పుడు 22 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిల్లో పలు కేంద్రాల ఏర్పాటులో న్యాయస్థానంలో విచారణ వంటి కారణాలతో జాప్యం జరిగింది. మొత్తం ఈ 22 కేంద్రాలను రోగులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క డయాలసిస్‌కు ప్రభుత్వం రూ.999 చొప్పున వ్యయం చేయనుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో డయాలసిస్ సెషన్‌కు రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చవుతుంది. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి నెలకు నాలుగైదు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉండటం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుంది.



# స్థానిక సమరంపై జగన్ సుదీర్ఘ కసరత్తు

### అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నద్ధతపై చర్చలు

### పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు అబ్జర్వర్లతో విస్తృత చర్చలు

**తాడేపల్లి, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడువైయస్.జగన్మోహన్‌రెడ్డి మరోమారు పార్టీ సీనియర్ నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఆయన పార్టీ నాయకులతో మాట్లాడారు. అభ్యర్థుల ఎంపిక, సమర్థవంతంగా ఎన్నికలను ఎదుర్కోవడంపై పార్టీకి చెందిన రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటరీ పార్టీ అబ్జర్వర్లతో చర్చించారు. జిల్లాల వారీగా ఈ సమావేశాలు జరిగాయి. సంబంధిత రీజినల్ కో-ఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ అబ్జర్వర్లతో వైఎస్ జగన్ ముఖాముఖి చర్చలు జరిపారు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికలను ఎదుర్కోవడంపై ఆయన వారికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు, మున్సిపాల్టీలకు రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో వీటిపై ప్రధానంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన, అరాచకాలు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఇంకా రెండున్నరేళ్లగా రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గపాలన, వాటి పరిస్థితులను పరిగణలోకి తీసుకుని బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఈ విషయంలో జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతిపాదిత అభ్యర్థులకు కుల ధ్రువీకరణ, నోడ్యూ సర్టిఫికెట్ విషయంలో అధికారులతో అక్రమాలు చేయిస్తున్నారన్నారు. విశాఖపట్నంలో శశికళ అనే తాజా మాజీ కార్పొరేటర్ ఎస్సీ కులస్తురాలు అయితే, ఆమెకు ఓసీ కాపుగా సర్టిఫికెట్ ఇవ్వడం దీనికి నిదర్శనమన్నారు. దీనిపై పోరాడి పరిష్కారం దక్కించుకునేలోగా ఎన్నికల సమయం ముగుస్తుందని, చంద్రబాబు ఇలాంటి తప్పుడు విధానాలను అనుసరిస్తున్నాడని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని అంశాలపై రీజినల్ కో-ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు స్పందించాలని కోరారు. అసెంబ్లీ అబ్జర్వర్లు, పార్లమెంటు అబ్జర్వర్లు స్థానికంగా అందుబాటులో ఉండాలని నిర్దేశించారు.



అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు చేస్తున్న అక్రమాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలని, వాటన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకు రావాలని, లీగల్ టీంను అప్రమత్తం చేసి కోర్టుల ద్వారా వెంటనే న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా విషయాన్ని వెంటనే ఎన్నికల కమిషన్‌తో పాటు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఈ ప్రక్రియను మొత్తం రికార్డు చేయాలని నిర్దేశించారు. వైయస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను బైండోవర్లు పేరిట పోలీసులు వేధింపులకు దిగుతున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని, వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, చట్టాన్ని ధిక్కరిస్తూ వ్యవహరించే వారిపై న్యాయపోరాటం తప్పదనే సందేశం ఇవ్వాలన్నారు. పార్టీ పట్ల అత్యంత విశ్వసనీయత, విధేయత ఉన్న వారికి అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 14 అక్టోబర్ 2026

# మడ అడవుల సంరక్షణతోనే మానవ మనుగడకు భరోసా

- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నాగబాబు
- సంగమేశ్వరంలో స్వయంగా మడ మొక్కలు నాటిన నాగబాబు



**మచిలీపట్నం, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** మడ అడవుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణకే కాకుండా, మానవ మనుగడకు కూడా అత్యంత కీలకమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. ఒకప్పుడు పొయ్యిలో కట్టెల కోసం మడ అడవులను విచ్చలవిడిగా నరికివేసి, సహజంగా ఏర్పడిన విలువైన వృక్ష సంపదను నాశనం చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన సంపదను కాపాడుకోవాల్సింది పోయి, దానిని ధ్వంసం చేయడం ద్వారా మన వినాశనాన్ని మనమే కొని తెచ్చుకున్నామన్నారు. మడ అడవులను సంరక్షిస్తే అవి భవిష్యత్తులో మనకు గొప్ప జీవనాధారంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సంఘమేశ్వరంలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో కలిసి పాల్గొన్నారు. 100 హెక్టార్ల విస్తీర్ణంలో మూడు లక్షల మడ మొక్కలను నాటే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో నాగబాబు స్వయంగా మొక్కలు నాటి, మడ అడవుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ... " కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెట్లను నరికివేయాలంటే అనేక ఆంక్షలు ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలోనూ వృక్ష సంపద పరిరక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో కొన్ని లోపాలు ఉన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు త్వరలోనే వాల్టా చట్టాన్ని మరింత క్రియాశీలంగా అమలు చేస్తాం. ఒక్కో మొక్క పర్యావరణానికి అందించే ప్రయోజనాలు వెలకట్టలేనివి. అయినప్పటికీ, మన చుట్టూ ఉన్న చెట్లను, విలువైన మడ అడవులను నరికివేస్తూ ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నా పట్టించుకోకపోవడం ఆందోళనకరం. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, వృక్ష సంపదను కాపాడేందుకు ముందుకు రావాలి. మనం చెట్లను కాపాడితే.. అవే మనల్ని కాపాడతాయి. ప్రకృతిని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కమిషనర్ బి.ఎన్.ఎన్. మూర్తి, అటవీశాఖ సలహాదారులు మల్లికార్జున రావు, డిఎఫ్ఓ త్రిమూర్తుల రెడ్డి, ప్రజా ప్రగతి సేవా సంఘ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడు దివ్యదర్శనం

**తిరుమల, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సర్వాలంకార భూషితుడైన స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముందుగా గజాలు, అశ్వాలు నడుస్తుండగా, భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, వివిధ కళాబృందాల ప్రదర్శనల నడుమ వాహనసేవ కన్నులపండువగా సాగింది. గోవింద నామస్మరణలతో తిరుమల మాడ వీధులు మార్మోగాయి. వైష్ణవ సంప్రదాయంలో భగవంతుడిని 'శేషి'గా, ప్రపంచాన్ని 'శేషభూతం'గా భావిస్తారు. నాగరాజైన వాసుకిని ప్రతిబింబించే చిన్నశేష వాహనం ఈ శేషి భావాన్ని చాటిచెబుతుంది. చిన్నశేష వాహనంపై స్వామివారిని దర్శించుకోవడం వల్ల కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, కుండలినీ యోగసిద్ధి ఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి రహదారుల బలోపేతం కీలకం

- ఆత్మకూరులో రూ. 8.91 కోట్లతో నాలుగు లేన్స్ రహదారి అభివృద్ధి
- రహదారికి వాయుపుత్ర మార్గ్ గా నామకరణం
- మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్




**అమరావతి, అక్టోబర్ 13 (స్పంద న్యూస్) :** గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్ల వ్యయంతో నాలుగు లేన్స్ రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మొత్తం 2.2 కిలోమీటర్ల మేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఈ రహదారికి వాయుపుత్ర మార్గ్ గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆత్మకూరు రహదారిని వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన ఎన్ హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు సాకారం కావడం ఎంతో సంతోషకరం. ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చే లక్ష్యంతో మొత్తం రూ. 8.91 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాం. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు చేపట్టిన ఈ పనుల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 6.31 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని విస్తరించాం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల ద్వారా రూ.2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టనున్నాం. ఆత్మకూరు పట్టణ ప్రజలు నిత్యం జాతీయ రహదారి ఎన్‌హెచ్-67కు చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడంతో జాతీయ రహదారిని తలపించేలా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రహదారిని అభివృద్ధి చేశాం. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉంది. భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల మంజూరు చేశాం. ఆ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అన్నారు. సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరగా, ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అదేవిధంగా, తాగునీటి సమస్యను ప్రస్తావించగా.. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద ఇప్పటికే రూ.72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో స్థానిక సమరానికి నేడే నగారా!

**ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న రాష్ట్ర ఎన్నికల సంఘం**

**ఉదయం 11.30 గంటలకు విజయవాడలో మీడియా సమావేశం**

**మూడు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు**

**షెడ్యూల్ ప్రకటనతో రాష్ట్రంలో వేడెక్కనున్న రాజకీయ వాతావరణం**

**విజయవాడ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని రాజకీయ పార్టీలు, ఆశావహులు ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అక్టోబర్ 14న ఉదయం 11.30 గంటలకు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మీడియా ప్రతినిధులకు ఆహ్వానం పంపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీల్లో ఆసక్తి నెలకొంది.

## మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. తొలి విడతలో పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. రెండో విడతలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. చివరిగా మూడో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల దశలు, పోలింగ్ తేదీలు, నామినేషన్ల గడువులపై బుధవారం అధికారిక ప్రకటనతో స్పష్టత రానుంది.

## తొలి విడతలో మున్సిపల్ ఎన్నికలు!

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ముందుగా పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారమే విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రిజర్వేషన్ల ఖరారు, వార్డుల వారీగా ఏర్పాట్లు, ఓటర్ల జాబితాలు తదితర అంశాలపై ఇప్పటికే అధికారులు కసరత్తు చేపట్టారు. ఎన్నికల ప్రకటన వెలువడితే పట్టణాల్లో రాజకీయ సందడి మరింత పెరగనుంది.

## ఎన్నికల సంఘానికి చేరిన గెజిట్ నోటిఫికేషన్లు

స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్లు అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి చేరినట్లు సమాచారం. దీంతో షెడ్యూల్ ప్రకటనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, సంబంధిత అధికారుల సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## విజయవాడలో కీలక మీడియా సమావేశం

విజయవాడ ఎం.జీ. రోడ్డులోని నూతన శాఖాధిపతుల కార్యాలయాల భవనంలో ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు మీడియా సమావేశం జరగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌తోపాటు వివిధ దశల్లో నిర్వహించనున్న ఎన్నికలపై స్పష్టత వచ్చే అవకాశముంది.

## రాజకీయ పార్టీల్లో మొదలైన ఎన్నికల హడావుడి

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందన్న సమాచారంతో అధికార టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోపాటు ప్రతిపక్ష వైసీపీ, కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీల్లో ఎన్నికల సన్నాహాలు ఊపందుకునే అవకాశముంది. రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు, స్థానిక నాయకత్వ సమీకరణాలపై పార్టీలు దృష్టి సారించనున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారే అవకాశముంది. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్‌ను వెల్లడించిన తర్వాతే ఎన్నికల తేదీలు, దశలు, నోటిఫికేషన్లపై పూర్తి స్పష్టత రానుంది.

# బీసీల రిజర్వేషన్లకు వైసీపీ కోత.. 40శాతంతో టీడీపీ భరోసా

**మంత్రి కొల్లు రవీంద్ర**



**అమరావతి, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** బీసీల రిజర్వేషన్లకు వైసీపీ ప్రభుత్వం కోత విధిస్తే, కూటమి ప్రభుత్వం 40 శాతానికి పైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ బీసీలకు భరోసా ఇస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పునాదులు వేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో బలహీన వర్గాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని చెప్పారు. గత గొడ్డలి ప్రభుత్వ పాలనలో బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాల ఫలితంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు బలహీన వర్గాలు అనేక ప్రాంతాల్లో ఆధిపత్య వ్యవస్థల కింద అణచివేతకు గురయ్యాయని కొల్లు రవీంద్ర అన్నారు. నాటి పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, మండలిక వ్యవస్థను తీసుకొచ్చి బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుదేనని చెప్పారు. ఎన్టీఆర్ తొలుత 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చంద్రబాబు నాయుడు వాటిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. దాదాపు 1996-97 నుంచి ఈ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ అధ్యక్షులు జగన్ రెడ్డి ప్రభుత్వం 2020-21లో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. కావాలనే తమ అనుయాయులతో న్యాయస్థానాల్లో కేసులు వేయించి, సరైన న్యాయవాదులను నియమించకుండా, తగిన వాదనలు వినిపించకుండా వ్యవహరించారని విమర్శించారు. సొంత కేసుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసే జగన్ బీసీల రిజర్వేషన్ల విషయంలో మాత్రం చిత్తశుద్ధి చూపలేదన్నారు. బలహీన వర్గాలు నాయకులు కానీ, బలహీన వర్గాల ప్రజలు కానీ తెలుగుదేశం పార్టీతో ఉన్నారనే అక్కసుతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల కోత కారణంగా సుమారు 16,800 మంది బీసీలు చట్టబద్ధంగా స్థానిక సంస్థల్లో పొందాల్సిన పదవులను కోల్పోయారని కొల్లు రవీంద్ర అన్నారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలనే ఆలోచనతోనే గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వం కనీసం ప్రత్యేక కమిషన్‌ను కూడా నియమించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కమిషన్ ద్వారా సర్వే నిర్వహించి, నివేదిక సిద్ధం చేసి రిజర్వేషన్ల అంశంపై ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.12,500 కోట్ల నిధులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని అసెంబ్లీ సాక్షిగా నిర్ణయం తీసుకుని, ఆ దిశగా చర్యలు చేపట్టిన సమయంలో మళ్లీ న్యాయస్థానాల్లో కేసులు వేయించి అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. ప్రభుత్వం హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ న్యాయపోరాటం చేసినప్పటికీ, రిజర్వేషన్ల అమలులో ఎదురైన పరిస్థితులను పరిశీలించి, సాధ్యమైన మార్గాల ద్వారా బీసీలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే నిర్ణయం తీసుకుందని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు లభించిన రిజర్వేషన్ల వివరాలను మంత్రి వెల్లడించారు.



# సీఈసీ రాజీనామా చేయకుంటే అభిశంసన తప్పదు

### ఎంపీ శశిథరూర్ హెచ్చరిక!

### ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపణ

### తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్ర విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని, లేకుంటే ఆయన తొలగింపునకు రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ చేపట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని శశిథరూర్ ఆరోపించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద సవరణ ప్రక్రియను నిలిపివేసి, అన్యాయంగా తొలగించినట్లు నిర్ధారణ అయిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని కోరారు. ఓటర్ల వివరాల పరిశీలనకు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్, సాంకేతిక విధానాలను స్వతంత్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లకు కల్పించిన చట్టపరమైన రక్షణలను ప్రస్తావిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంపై శశిథరూర్ విమర్శలు చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ల నేపథ్యంలో ఆ చట్టం ఆమోదం పొందిన తీరును ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగుతున్న వ్యక్తిపై ప్రజల విశ్వాసం నిలవడం అత్యవసరమని శశిథరూర్ పేర్కొన్నట్లు సమాచారం. జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే ఆయన తొలగింపునకు పార్లమెంటులో తీర్మానం తీసుకొచ్చే అంశాన్ని ప్రతిపక్షాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపునకు వర్తించే విధానంలోనే పదవి నుంచి తొలగించవచ్చు. అయితే ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయనే అంశాలు శశిథరూర్ చేసిన ఆరోపణలుగానే ఉన్నాయి. వాటిపై ఎన్నికల సంఘం అధికారిక వివరణ, సంబంధిత ఆధారాల పరిశీలన అవసరం. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజ్యాంగపరమైన పదవీ రక్షణ లేదనే వాదన కూడా సరైనది కాదు. ఆయన తొలగింపునకు రాజ్యాంగంలో ప్రత్యేక ప్రక్రియ ఉంది.

# వాదిస్తే నిజాలు అబద్ధాలు కావు..

### లద్దాఖ్‌పై చైనాకు భారత్ కౌంటర్

### లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

### గతంలో మనదే.. ఇప్పుడూ మనదే.. భవిష్యత్తులోనూ మనదే

### చైనా అభ్యంతరాలను తోసిపుచ్చిన విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్ విషయంలో చైనా చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. లద్దాఖ్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని, ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. లద్దాఖ్‌ను భారత్‌లో భాగంగా గుర్తించబోమంటూ చైనా వ్యక్తం చేసిన అభ్యంతరాలకు మంగళవారం మీడియా సమావేశంలో ఆయన సమాధానమిచ్చారు. చైనా ఎంతగా వాదించినా చారిత్రక, భౌగోళిక వాస్తవాలు మారిపోవని తేల్చిచెప్పారు. లద్దాఖ్ భారతదేశంలో అంతర్భాగమనే విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. గతంలోనూ లద్దాఖ్ భారత్‌లో భాగంగానే ఉందని, ప్రస్తుతం కూడా అలాగే ఉందని, భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంపై భారతదేశ వైఖరి సుస్పష్టంగా ఉందని చెప్పారు. చైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినంత మాత్రాన వాస్తవాలు మారిపోవని వ్యాఖ్యానించారు. లద్దాఖ్ ప్రాంతంలోని 28 భౌగోళిక ప్రదేశాలను గుర్తిస్తూ కేంద్ర హోం శాఖ అక్టోబర్ 2న కొత్త మ్యాప్‌ను విడుదల చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ చర్యపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. లద్దాఖ్‌ను భారతదేశంలో అంతర్భాగంగా తాము గుర్తించలేదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ప్రకటించారు. వివాదాస్పద ప్రాంతాల్లో భౌగోళిక ప్రదేశాలను గుర్తించడం చట్టవిరుద్ధమని చైనా వాదించారు. ఆ ప్రాంతంలోని కొన్ని భూభాగాలపై తమకూ హక్కులున్నాయని పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ గుర్తించినట్లు పేర్కొన్న 28 భౌగోళిక ప్రదేశాల్లో పది పర్వత శిఖరాలు, రెండు కనుమలు, మూడు పర్వతాలు, ఏడు భూభాగాలు, రెండు హిమానీనదాలు, రెండు జలవనరులు, ఒక లోయ, ఒక నది ఉన్నాయి. ఈ ప్రాంతాల గుర్తింపును చైనా ప్రశ్నించడంతో ఇరుదేశాల మధ్య సరిహద్దు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. లద్దాఖ్ విషయంలో చైనా వాదనలను అంగీకరించే ప్రసక్తే లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్ భారతదేశంలో అంతర్భాగమనే అధికారిక వైఖరిని పునరుద్ఘాటించింది. సరిహద్దు వివాదాల నేపథ్యంలో ఇరుదేశాలు తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నప్పటికీ లద్దాఖ్‌పై భారతదేశ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

# అధికారం అజమాయిషీకి కాదు.. ప్రజల సాధికారతకే!





- ప్రజలను నియంత్రించడం కాదు.. అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సాంకేతికత, సమాచారం, ఆవిష్కరణల ఫలాలు అందరికీ అందాలి
- పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై నిలిచిందన్న ప్రధాని
- తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదైందని వెల్లడి
- పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** అధికారం ప్రజలపై అజమాయిషీ చెలాయించడానికి కాదని, వారికి కొత్త అవకాశాలు కల్పించి సాధికారత దిశగా నడిపించేందుకు ఉపయోగపడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ప్రజలను తమపై ఆధారపడేలా చేయకుండా స్వశక్తితో ఎదిగే అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. సాంకేతికత, సమాచారం, విజ్ఞానం, ఆవిష్కరణలు నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులుగా మారాయని, వాటి ప్రయోజనాలు కొద్దిమందికే పరిమితం కాకుండా కోట్లాది మందికి అందాలని పిలుపునిచ్చారు. మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రసంగించిన మోదీ ప్రపంచ దేశాలు పోటీకి బదులుగా సహకారానికి, నియంత్రణకు బదులుగా ప్రజల సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై నిలిచి ఉందని ప్రధాని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 7.8 శాతంగా నమోదైందని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని మోదీ తెలిపారు. 2014లో దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లు ఉండగా ప్రస్తుతం 300 గిగావాట్లకు చేరుకుందని పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధన వినియోగం పర్యావరణ పరిరక్షణతోపాటు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందని చెప్పారు. హరిత ఇంధన రంగం భవిష్యత్తు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా నిలిచిందని ప్రధాని అభివర్ణించారు. దేశంలో వందకు పైగా భాషలు, సుమారు 80 వేల వార్తాపత్రికలు, ప్రచురణలు, వెయ్యికి పైగా ఉపగ్రహ టెలివిజన్ ఛానళ్లు ఉన్నాయని తెలిపారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో 50 కోట్ల మందికి పైగా భారతీయులు చురుగ్గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి, ప్రజల మధ్య చర్చలు జరగడానికి డిజిటల్ సాంకేతికత విస్తృత అవకాశాలు కల్పిస్తోందన్నారు.

గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ సంఖ్య ప్రపంచంలోని అనేక దేశాల మొత్తం జనాభా కంటే ఎక్కువని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ విధానాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. అధికారాన్ని ప్రజలను నియంత్రించే సాధనంగా కాకుండా వారి సామర్థ్యాలను పెంపొందించే శక్తిగా ఉపయోగించాలని స్పష్టం చేశారు. సాంకేతికత, విజ్ఞానం, ఆవిష్కరణల ప్రయోజనాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారానే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్య రక్షణకు కలిసికట్టుగా పోరాడుతాం

- ఇండియా కూటమి భేటీలో రాహుల్ గాంధీ పిలుపు!
- రాహుల్ నివాసంలో ఇండియా కూటమి నేతల కీలక భేటీ
- ఓటర్ల జాబితాల సవరణ, ఓట్ల తొలగింపుపై చర్చ
- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడతాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రజల నిరసన తెలిపే హక్కును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. మంగళవారం ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ప్రజలు తమ అభిప్రాయాలను, నిరసనలను ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేసేందుకు జంతర్ మంతర్ ప్రధాన వేదికగా నిలిచిందని రాహుల్ పేర్కొన్నారు. ఇటీవల అక్కడ నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని తెలిపారు. అయితే ప్రజల నిరసన గళాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆ వేదికపై ఆంక్షలు విధించిందని ఆరోపించారు. జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శనలపై నిషేధం విధించాలనే నిర్ణయాన్ని సవాలు చేస్తామని ప్రకటించారు. ప్రజల నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం అంత సులభంగా కాలరాయలేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. జంతర్ మంతర్‌లో నిరసనలపై ఆంక్షల వెనుక ఈ ముగ్గురి పాత్ర ఉందని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీసి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే ప్రయత్నాలపై రాజకీయంగానూ, చట్టపరంగానూ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇండియా కూటమి నేతలు సమావేశంలో చర్చించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారనే అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అంశంపైనా నేతలు చర్చించినట్లు వెల్లడించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడతాయని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రకటించారు. అయితే ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, నిరసనలపై ఆంక్షల వెనుక వ్యక్తుల పాత్రకు సంబంధించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలుగా ఉన్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం అధికారిక స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

# నీట్ పేపర్ లీకేజీలకు ఇక చెక్ పడాల్సిందే!

- ఒకే ప్రశ్నపత్రం విధానానికి స్వస్తి పలకాలి
- పరీక్ష ప్రారంభానికి నిమిషాల ముందే ప్రశ్నపత్రం సిద్ధం చేయాలి
- భారీ ప్రశ్నల నిధితో అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు
- కాగితం పరీక్షలకు బదులు కంప్యూటర్ ఆధారిత విధానం
- దేశవ్యాప్తంగా లక్షన్నర పరీక్షా కేంద్రాలు అవసరం
- పరీక్షల వ్యవస్థలో సమూల మార్పులకు నందన్ నిలేకని సూచనలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే పరీక్షల నిర్వహణ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని సూచించారు. ముందుగానే ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి ముద్రించే విధానం వల్ల దానిని అక్రమంగా సంపాదించి విక్రయించే అవకాశాలు ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీ జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే అసలు లీకేజీకి అవకాశం లేకుండా పరీక్షా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్షల కోసం ముందుగానే ఒకే ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసి భద్రపరిచే విధానాన్ని నందన్ నిలేకని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం ముందుగానే అందుబాటులో ఉండటం వల్ల దానిని లీక్ చేసి విక్రయించే అక్రమ దందాలకు అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడాలంటే ప్రశ్నపత్రాల రూపకల్పన నుంచి పరీక్ష నిర్వహణ వరకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. ప్రవేశ పరీక్షలకు భారీ సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల నిధిని రూపొందించాలని నిలేకని ప్రతిపాదించారు. పరీక్ష ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు మాత్రమే ఆ ప్రశ్నల నుంచి స్వయంచాలక విధానంలో ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. ప్రశ్నపత్రాల లీకేజీల ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించే వ్యవస్థకు ఈ విధానం అడ్డుకట్ట వేయగలదని అభిప్రాయపడ్డారు. సంప్రదాయ కాగితం ఆధారిత పరీక్షల నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షల వైపు మారాల్సిన అవసరం ఉందని నందన్ నిలేకని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో ప్రశ్నపత్రాల తయారీ, పంపిణీ, పరీక్షల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టవచ్చని వివరించారు. అయితే దేశవ్యాప్తంగా విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా అవసరమైన సాంకేతిక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలను విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా కనీసం లక్షన్నర పరీక్షా కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని నిలేకని ప్రతిపాదించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కేంద్రాల వ్యవస్థను విస్తరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భద్రతతోపాటు విద్యార్థులకు అందుబాటు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగిన ప్రతిసారీ విచారణలు, అరెస్టులతో సరిపెట్టకుండా పరీక్షా వ్యవస్థలోనే లోపాలను సరిదిద్దాలని నందన్ నిలేకని అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో మార్పుల అమలుపై ప్రధానమంత్రి కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరగాలంటే పారదర్శకత, భద్రత, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిలేకని సూచనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఆయన ప్రతిపాదించిన విధానాలు అమల్లోకి రావాలంటే ప్రశ్నల నిధి భద్రత, సాంకేతిక సామర్థ్యం, పరీక్షా కేంద్రాల సిద్ధత వంటి అంశాలపై సమగ్ర పరిశీలన అవసరం. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 14 అక్టోబర్ 2026

# కొర్నెపాడులో పర్యటించిన జిల్లా కలెక్టర్

## బయోచార్ తయారు చేసే వివిధ రకాల పద్ధతుల పరిశీలన



**వట్టిచెరుకురు, అక్టోబర్ 13(స్పంద న్యూస్) :** జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఉన్న రైతు నేస్తం ఫౌండేషన్ ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు, ప్రకృతి వ్యవసాయంలో ఫైవ్ లేయర్ మోడల్ విధానాలు, అచ్చట ఉన్న దేశీయ గోజాతులు - ఒంగోలు, కాంక్రీజ్ , పుంగనూరు, సాహివాల్ , గిర్ ఆవుల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, ఘన జీవామృతం తయారీ విధానం, కాషాయాలు, జీవామృతం తయారీ విధానం, సమగ్ర వ్యవసాయ విధానంలో భాగంగా గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పెంపకం గురించి అవగాహన చేసుకోవడం, ఆవుల గో మూత్రం, పేడతో వివిధ రకాలైన బై ప్రోడక్ట్ - ప్రమిదలు, ధూప్ స్టిక్స్, పిడకలు, వినాయక ప్రతిమల తయారీ పై ఆరా తీశారు. మహిళలు తమ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించుటకు తద్వారా ఆర్థికంగా అభివృద్ధి కావదానికి అవకాశాలపై రెండు రోజుల నుండి రైతు నేస్తం ఫౌండేషన్ లో శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వచ్చిన మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. రైతు నేస్తంలో జరుగుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలను పరిశీలించారు. టమాటా సాస్ తయారీ విధానం, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ విధానం, వేరుశెనగ విత్తనాలు వేరు చేసే యంత్రం, వెన్న తీసే యంత్రం, బూందిలో నుండి ఆయిల్ వేరు చేసే యంత్రం, ఎద్దుల గానుగ నూనె తయారీ, పిండి వంటల తయారీ మెషిన్, మిల్లెట్స్ బిస్కట్స్ తయారీ మెషిన్, గరం మసాలా తయారీ మెషిన్, వెజిటబుల్ కట్టర్ మెషిన్, పాకింగ్ మెషిన్, వాక్యూమ్ పాకింగ్ మెషిన్, మోడల్ ఆర్గానిక్ స్టోర్, బయో రీసెర్చ్ సెంటర్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు స్థాయిలో బయోచార్ తయారు చేసే వివిధ రకాల పద్ధతులను తెలుసుకొని, వాటిని రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేసి రైతుల భూముల ఆరోగ్యాన్ని మెరుగు పరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచాలని, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వర రావుని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజకుమారి, నాబార్డ్ డి.డి.ఎం శరత్, ఎల్.డి.ఎం మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# రైతు బజార్‌లో కంపుకొడుతున్న చెత్త

## ముక్కుమూసుకుంటున్నవినియోగదారులు

**చిలకలూరిపేట అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** పట్టణంలోని రైతు బజార్‌లో పారిశుధ్య లోపం తీవ్ర స్థాయికి చేరింది. మార్కెట్ ప్రాంగణంలో కుళ్లిపోయిన, పాడైపోయిన కూరగాయలు గుట్టలుగా పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుండటంతో అక్కడ వ్యాపారులు, కొనుగోలుదారులు క్షణం కూడా నిలబడలేని దుస్థితి నెలకొంది. బజార్‌కు వచ్చే ప్రజలు ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కూరగాయలు కొంటే కొత్త రోగాలు ఏమైనా చుట్టుముడతాయేమోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించకపోవడమే కాకుండా, చెత్త తరలించే వాహనం రిపేర్‌లో ఉందంటూ సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తరలించి, బ్లీచింగ్ చల్లించి రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

# కారంపూడిపోలీస్ స్టేషన్ ను పరిశీలించిన పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదాహళ్లి



**కారంపూడి, అక్టోబర్ 13, ( పల్నాడు జిల్లా) స్పంద న్యూస్ : –** సాధారణ తనిఖీలలో భాగంగా మంగళవారం కారంపూడి పోలీస్టేషన్లో తనిఖీ నిర్వహించిన పలనాడు జిల్లా నూతన ఎస్పీ జగదీష్ ఆదహళ్లి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలోని అన్ని మండలాలలో సమస్యాత్మకమైన గ్రామాలు ఎన్ని ఉన్నది, వాటి స్థితిగతులను, పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం జిల్లా మొత్తం పర్యటిస్తున్నట్లు పలనాడు జిల్లా నూతన ఎస్పి జగదీష్ ఆదహళ్లి తెలియజేశారు. కారంపూడి మండలం లో ఉన్న సమస్యాత్మక గ్రామాలలో పరిస్థితులను ఎలా కంట్రోల్ చేసి,శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలో స్థానిక ఎస్సై వాసు కి, సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ కు సూచనలు చేసినట్లుగా తెలియజేశారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలను కూడా తనిఖీ నిర్వహించారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పల్నాడు జిల్లా బాధ్యతలను నూతనంగా స్వీకరించిన తాను సాధారణ తనిఖీల్లో భాగంగా కారంపూడి విచ్చేసినట్లుగా తెలియజేశారు. ఎవరైనా ఫ్యాక్షనిజం, రౌడీయిజం నిర్వహించి ఎన్నికలకు భంగం కల్పించిన ఎడల అలాంటి వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సమాజానికి హానికరమైన కార్యక్రమాలను నిర్వహించే వారిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ జగదీష్ అదహళ్లి తెలియజేశారు. ఈ తనిఖీలు గురజాల డిఎస్పి మహేశ్వరరావు, కారంపూడి సి ఐ ఆవుల భాస్కర్, స్థానిక ఎస్సై వాసు ఇంకా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొల్లూరు, అక్టోబర్ 13(స్పంద న్యూస్):** గ్రామాలలోని ప్రజలకు కంటికి సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండటం కోసమే కంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెనాలి రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర పారిస్ అధ్యక్షులు కనగాల మధుసూదన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం గాజుల్లంక వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ మత్తి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం కుమారుడు నరేంద్ర ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండల పరిధిలోని గూడవల్లి గ్రామంలో ఉన్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారన్నారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. పరీక్షలు చేయించుకుని తగు సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. కంటి పొరలు, శుక్లాలు ఉన్న వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారికి అవసరాన్ని బట్టి రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర పారిస్ అధ్యక్షులు కనగాల మధుసూదన్ ప్రసాద్ తండ్రి సుబ్బారావు జ్ఞాపకార్థం ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేయనున్నట్లు తెలిపారు. శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి తెనాలి వైకుంఠపురం ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ ఈదర వెంకట పూర్ణ చంద్ మాట్లాడుతూ కనగాల మధుసూదన్ ప్రసాద్ రోటరీ క్లబ్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందిస్తున్నారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మెంబర్స్,కాసరనేని మోహన్, మన్నే శ్రీనివాసరావు,జాస్తి వినోద లక్ష్మి,మున్నంగి శ్రీనివాసరావు, చిట్టినేని సత్య వరప్రసాద్, సనకా పాపారావు,మత్తి నరేంద్ర, రాంబాబు,సిబ్బంది సరళ నవీన్ రాజు,పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**వేమూరు, అక్టోబర్ 13(స్పంద న్యూస్):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల జిల్లా పరిశీలకులు, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు జంగా కృష్ణమూర్తి తెలియజేశారు, మంగళవారం స్థానిక లక్ష్మీ పద్మావతి కళ్యాణ మండపంలో వేమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు విస్తృతపరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు, జిల్లా పార్టీ అధ్యక్షులు సలగల రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం ఉందన్నారు, స్థానిక సంస్థల్లో గెలుపు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమానికి సంకేతం కావాలన్నారు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించకపోయినా వారికి సముచిత స్థానం గౌరవం లభించే విధంగా పనిచేస్తానని గుర్తు చేశారు, పార్టీ ఆదేశాల మేరకు 100% గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని తెలియజేశారు, సమావేశంలో రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్,పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరాజు, పార్టీ నాయకులు విజయబాబు, డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, సాయిబాబా, దండే సుబ్బారావు, గాజుల వెంకటసుబ్బయ్య, అమ్మిశెట్టి కిషోర్, మైనేని మురళీకృష్ణ, వాక శేషుబాబు, కొత్తపల్లి రవీంద్రబాబు, దాది లక్ష్మణరావు, షేక్ అనీఫ్, బిజెపి నాయకులు మంద జనార్ధన్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా రౌడీ షీట్స్ బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు

## వైయస్ఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు

**గుంటూరు, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** మంగళవారం ఉదయం, గుంటూరు నగరం, బృందావన్ గార్డెన్స్‌లో గల, గుంటూరు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో, జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య సమావేశంలో పాల్గొన్న, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ, అక్రమంగా మా నాయకులపై "రౌడీ షీట్స్" బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని అన్నారు, మహిళలు అని కూడా చూడకుండా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు అనే నెపంతో మహిళా నేతల మీద రౌడీ షీట్స్ బనాయించి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఏకైక ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వం అని అన్నారు. అనంతరం, నియోజకవర్గంలో పార్టీ నాయకుల మీద కానీ కార్యకర్తలపై గాని అక్రమంగా పోలీసులు నోటీసులు ఇవ్వటం లేదా రౌడీ షీట్స్ బనాయించాలని చూస్తే, న్యాపరంగా వాటిని ఎదుర్కుంటాం అని అన్నారు మరియు ప్రతి ఒక్కరికీ పార్టీ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్ ,పార్లమెంట్ పరిధిలో గల అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, పరిశీలకులు ,మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల అన్ని డివిజన్ల ముక్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థపై అధికారుల నిర్లక్ష్యం

## మాదాసు భానుప్రసాద్



**చిలకలూరిపేట అక్టోబర్ 13 స్పంద న్యూస్:** పట్టణంలో పావుగంట, అరగంట పాటు వర్షం పడితే చాలు రోడ్లన్నీ చెరువులను తలపిస్తూ మోకాళ్ళ లోతు నీళ్లు నిలిచిపోతున్నాయని, అధికారులు కేవలం కాంట్రాక్టులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పక్కా ప్రణాళికతో పనులు చేయడం లేదని స్థానిక నాయకుడు మాదాసు భానుప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రధానమైన 7 డ్రైన్ల పరిస్థితిని మాత్రం గాలికొదిలేశారని దుయ్యబట్టారు. రోడ్లు, డ్రైన్లు నిర్మించే సమయంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా 'వాటం' చూస్తున్నారా లేదా అన్న సోయి కూడా అధికారులకు లేదని మండిపడ్డారు. నిలిచిన మురుగునీటి వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, వైరల్ జ్వరాలతో పేద ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ తరహాలోనే ప్రతి నెలా రెండు లేదా మూడు ఆదివారాలు ప్రత్యేక నిర్వహణ చేపట్టి, డ్రైన్లలోని పూడిక (సిల్ట్) పూర్తిగా తొలగించి శాశ్వత పరిష్కారం చూపకపోతే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# భారీగా పెరుగుతున్న బియ్యం ధరలు

## ప్రజల నడ్డి విరుస్తున్న దళారులు!

**ప్రత్తిపాడు, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఆశ్రయించే డీ-మార్ట్ వంటి సూపర్‌మార్కెట్లలోనే బియ్యం ధరలు విపరీతంగా పెరగగా, ఇక బయట బహిరంగ మార్కెట్‌లో రేట్లు రెండింతలు కావడంతో సామాన్యుడిపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. దళారులు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అడ్డగోలుగా ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ సమయాల్లో ధాన్యం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం ఎల్‌నినో సాకు చూపిస్తూ బియ్యం ధరలను పెంచడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో పేరు చెప్పి దళారులు ప్రజలను దోచుకునే కుట్ర చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బహిరంగ మార్కెట్‌లో ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలు, సామాన్యులు రోడ్లెక్కి ధర్నాలు చేసే పరిస్థితి వస్తుందని, తక్షణమే బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బీసీలకు మొండిచేయి చూపిన ఎమ్మెల్యే యరపతినేని

## వైసిపి బీసీ నాయకుల తీవ్ర ఆరోపణ!

**దాచేపల్లి, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** బీసీల అభివృద్ధి అంటూ ఉకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే తెలుగుదేశం పార్టీ నాయకులు పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని వైసిపి బీసీ నాయకులు ఆరోపించారు. దాచేపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి చేనేత విభాగం నాయకుడు ముశ్యం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురజాల, దాచేపల్లి పట్టణాల బీసీలకు మొండిచేయి చూపారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురజాల, దాచేపల్లి మున్సిపాలిటీలు మొదట బీసీ రిజర్వేషన్లుగా ప్రచారం జరిగిందని, అయితే ఒక్క రోజు వ్యవధిలోనే ఎమ్మెల్యే యరపతినేని రెండింటినీ ఓసీగా మార్చేశారని విమర్శించారు. బీసీలకు మున్సిపల్ ఛైర్మన్ పదవులు దక్కడం సహించలేకనే అగ్రకులాల కోసం రిజర్వేషన్లను మార్చారని ఆరోపించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి హయాంలో మార్కెట్ కమిటీలు, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో బీసీ, ఎస్సీ, మైనారిటీలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా నిబద్ధత ఉంటే దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీల్లో బీసీ అభ్యర్థులను నిలబెట్టగలరా అని సవాలు విసిరారు. ఈ సమావేశంలో దాచేపల్లి పట్టణ అధ్యక్షుడు షేక్ సుభాని, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఖాధర్ భాషా, సీనియర్ నాయకులు జాకీర్ హుస్సేన్, ముశ్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 14 అక్టోబర్ 2026

## 48వ డివిజన్‌లో రూ.97.9 లక్షలతో

# అభివృద్ధి పనులకు శ్రీకారం

### సరస్వతి నగర్, మదర్ థెరిస్సా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

### ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు



గుంటూరు, అక్టోబర్ 13 (స్పంద న్యూస్ ): గుంటూరు నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూర్ల రామాంజనేయులు తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్‌లో రూ.97.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు.డివిజన్‌లోని సరస్వతి నగర్ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీల్లో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రహదారుల నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుదల ద్వారా స్థానిక ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ పనులు ఉపయోగపడనున్నాయి.

#### మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగ్గా ఉంటే ప్రజలకు నిత్యజీవితంలో సౌకర్యం కలుగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

#### ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల

అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ నిలిచారని ఈ సందర్భంగా ఆయనను స్మరించుకున్నారు.

#### కార్యక్రమంలో పలువురు నాయకుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు ఆచంట సునీత, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, 48వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల సరఫరాలో సమస్యలు ఉండరాదు



గుంటూరు, అక్టోబర్ 13 స్పంద న్యూస్ : ఎరువుల సరఫరాలో సమస్యలు ఉండరాదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక రంగాలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. యూరియా, ఎరువుల సరఫరా, డిమాండ్ అంచనాలు వేసి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా లోపం ఉండరాదన్నారు. ఎయిమ్స్ యాప్ ద్వారా పంపిణీ జరగాలన్నారు. రైతుల ఇ – కేవైసి త్వరగా చేయించాలన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాల్సి ఉందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రాథమిక రంగాల శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించాలని తద్వారా పంటలు, పశువుల పోషణ సక్రమంగా జరిగి ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆవులు, గేదెల పెంపకం వలన పాల ఉత్పత్తికి దోహదం చేయవచ్చని, కోళ్ళు, మేకల పెంపకం కూడా ఆర్థిక అభ్యున్నతికి అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను చేయడంలో అశ్రద్ధ చేయరాదని అన్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా ఎక్కువ మంది రైతులు మార్పు చెందుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి మాట్లాడుతూ ఇ – పంట 97 శాతం పూర్తి అయిందన్నారు. లక్ష్యం మేరకు పూర్తి చేస్తామని చెప్పారు. సిబ్బంది కరువు లెక్కల సేకరణలో కొంత మేర నిమగ్నం కావడం వలన కొంత జాప్యం జరిగిందన్నారు. సి.సి.ఆర్సి బీమా శత శాతం చేశామన్నారు. మూడు డ్రోన్ లు ఎస్.సి లబ్ధిదారులకు రావలసి ఉందన్నారు. మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి మాట్లాడుతూ యూరియా, ఎరువుల కొరత లేదన్నారు. ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం క్రింద 49,620 ఎకరాలలో 44,029 మంది రైతులు చేయుటకు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ ఉప సంచాలకులు మరియు ఎ.పి.ఎం.ఐ.పి పి.డి ఎల్. వజ్రశ్రీ, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



### స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేయాలి: కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, అక్టోబర్ 13 స్పంద న్యూస్ : జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాలపై తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీ–పీఎన్‌డీటీ), సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి ఈ అక్రమాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తులు వై. నాగరాజా, వెంకట నాగ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. పద్మావతి, డీఎస్పీ సీతారామయ్య, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డెమో సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాగులేరును పూర్తి స్థాయి లో ప్రక్షాళన చేస్తాం..

### -లో లెవల్ చప్టా నిర్మించి అభివృద్ధి చేస్తాం.
### -ఎమ్మెల్యే యరపతినేని.



దాచేపల్లి, అక్టోబరు 13(స్పంద న్యూస్ ).జలకళ తో కళకళ లాడే నాగులేరు నేటి దుస్థితి ని చూస్తే భాధేస్తుందని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దాచేపల్లి వచ్చిన యరపతినేని స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు నాగులేరు ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడారు.నాగులేరు ను డీపెనింగ్, వైడినింగ్ చేసి పూర్తి స్థాయి లో అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. హై లెవల్ బ్రిడ్జి కి ఇరువైపుల లో లెవల్ చప్టా లను నిర్మించి నారాయణపురం, దాచేపల్లి లకు సులభతరంగా రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 2014–19 మధ్య లో హై లెవల్ చప్టా నిర్మించింది మనమేనన్నారు1994 లో తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు లో లెవల్ బ్రిడ్జి ఉండేదని, ప్రయాణికులు చాలా ఇబ్బంది పడేవాళ్ళని, బ్రిడ్జి దాటలంటే ఎక్కువసేపు వాహనాలు నిలిచిపోయేవన్నారు. మనహయాంలో అద్దంకి –నార్కెట్ పల్లి రహదారి నిర్మాణం సమయంలో నాగులేరు పై హై లెవల్ బ్రిడ్జి ని నిర్మించామన్నారు. అధేవిదంగా నియోజకవర్గం లో అనేక రోడ్ల ను వెడల్పు చేసి సిసి రోడ్ల ను అభివృద్ధి చేశామన్నారు. నాగులేరు ను సుందరీకరణ చేపట్టడం తో పాటు మున్సిపాలిటీ పరిధిలో పార్కు అభివృద్ధి చేస్తామన్నారు. యరపతినేని వెంట పార్టీ సీనియర్ నాయకులు తంగెళ్ళ శ్రీనివాసరావు, అక్కినపల్లి బాలయ్య, తోట వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

---

### అన్నపూర్ణాదేవి అలంకారంలో రేణుకమ్మ వారు



చిలకలూరిపేట అక్టోబర్ 13 స్పంద న్యూస్: నాదెండ్ల మండలంలోని అమీన్ సాహెబ్ పాలెం గ్రామంలో విజయదశమి శరన్నవరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా జగన్మాతను రోజుకో రూపంలో అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో నవరాత్రి ఉత్సవాల్లో మూడోరోజు రేణుక అమ్మవారికి విశేష అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అమ్మవారిని శాకంబరీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అన్న పూర్ణాదేవిగా విశేష అలంకరణలు నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువు దీరిన అమ్మవారి ని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం కు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. నవరాత్రి ఉత్సవాలతో ఆలయ ప్రాంగణాలు భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన కసరత్తు

### నరసరావుపేటలో పార్లమెంట్ సమన్వయకర్తల కీలక భేటీ



చిలకలూరిపేట అక్టోబర్ 13 స్పంద న్యూస్: నరసరావుపేటలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా జనసేన పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల కో–ఆర్డినేషన్ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త కళ్యాణం శివ శ్రీనివాసరావు (కే కే), మరో పార్లమెంట్ సమన్వయకర్త మండలనేని చరణ్ తేజ ముఖ్య పాత్ర పోషించారు. వీరితో పాటు నాయకులు పెండ్యాల బాలాజీ, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ హాజరయ్యారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీకి దక్కాల్సిన వాటా, వార్డుల్లో జనసైనికులకు కౌన్సిలర్ సీట్ల కేటాయింపు ప్రక్రియ, అలాగే అభ్యర్థులకు పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉనికి వంటి పలు కీలక అంశాలపై కళ్యాణం శివ శ్రీనివాసరావు, మండలనేని చరణ్ తేజ క్షేత్రస్థాయి వ్యూహాలపై విస్తృతంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. వార్డుల్లో బలమైన కేడర్ కలిగిన జనసైనికులకే ప్రాధాన్యత ఇవ్వాలని వారు స్పష్టం చేశారు. అంతకుముందు నాయకులు కళ్యాణం శివ శ్రీనివాసరావును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

## ప్రకృతి వ్యవసాయం సేద్య పద్ధతులపై పుస్తకాన్ని విడుదల చేసిన కలెక్టర్



గుంటూరు, అక్టోబర్ 13 స్పంద న్యూస్ : ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను రక్షించుకునే విధానంపై ప్రకృతి వ్యవసాయ విభాగం రూపొందించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉందని ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై పుస్తకం రూపొందించడం జరిగిందని, దీన్ని రైతులకు చేరవేయాలని అన్నారు. రైతులు పంటల సంరక్షణ చేసుకునే విధానం తద్వారా ఆర్థికంగా నష్టపోకుండా చూడాలన్నారు. ప్రకృతి సేద్యం విధానంలో పంటల పరిరక్షణ చేసే అవకాశాలను విపులంగా వివరించాలని చెప్పారు. ప్రకృతి సేద్యం విధానంలో పంటల పరిరక్షణకు రైతులు అందరూ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపర మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించనున్న స్వామినాథన్ ఫౌండేషన్ సభ్యులు



గుంటూరు, అక్టోబర్ 13 స్పంద న్యూస్ : కొల్లిపర మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని స్వామినాథన్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం పరిశీలించను న్నారని ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజ కుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొల్లిపర మండలం తూము లూరు, దవులూరు పాలెం గ్రామాల్లో సందర్శిస్తారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పసుపు, అరటి, బొప్పాయి పంటలను పరిశీలించడంతోపాటు పౌష్టికాహార వనాలను సందర్శిస్తారని చెప్పారు. అదేవిధంగా న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ ఎనర్జీ ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్ టీం కూడా జిల్లాలో సందర్శించనుందని చెప్పారు.




# ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

**దుబాయ్, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

**దుబాయ్, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

# రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం



**కల్యాణి, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?




**న్యూఢిల్లీ, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అదే సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

**గువాహటి, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

### షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

### అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

### రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

### సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.



ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 14 అక్టోబర్ 2026





# అందంతో కట్టిపడేస్తున్న టాలీవుడ్ బుట్టబొమ్మ..

### పూజా హెగ్డే బర్త్‌డే స్పెషల్!

**హైదరాబాద్, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే తన పుట్టినరోజును ఎంతో వేడుకగా జరుపుకుంటున్నారు. టాలీవుడ్ నుంచి కోలీవుడ్, బాలీవుడ్ వరకు తన అందం, అద్భుతమైన నటనతో మిలియన్ల మంది అభిమానుల మనసులను గెలుచుకున్న ఈ భామకు సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో బ్లూ అండ్ వైట్ డ్రెస్, బేబీ పింక్ గౌనులో రాయల్ లుక్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక పూజా నటించిన 'బుట్టబొమ్మ', 'అరబిక్ కుతు', 'జిగేల్ రాణి' వంటి సాంగ్స్ ఇప్పటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. గ్లామర్‌తో పాటు అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆమె ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాల విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్‌తో కలిసి రవి నీలకూడిటి దర్శకత్వంలో వస్తున్న 'శ్రీ శ్రీ' చిత్రంతో ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. అలాగే లారెన్స్ హర్రర్ ఫ్రాంచైజీ 'కాంచన 4' వంటి భారీ చిత్రాల్లోనూ నటిస్తూ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు.



# టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు..

### మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ఊగిసలాట!

**హైదరాబాద్, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):** టాలీవుడ్‌లో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి బ్లాక్‌బస్టర్ విజయాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ప్రస్తుతం మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చిత్రాల తర్వాత ఆమె దూసుకెళ్తుందని అంతా భావించినప్పటికీ, 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం ఊహించని పరిణామమైంది. ఇక 'కల్కి 2898 ఏడి' చిత్రంలో ఆమె చేసిన మొక్కుబడి పాత్ర పెద్దగా వర్కౌట్ కాలేదు. ఈ ఏడాది వచ్చిన 'డెకాయిట్' చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచినప్పటికీ, ఆ పాత్రలోని విభిన్నమైన ట్విస్ట్ అభిమానులకు పూర్తిగా కనెక్ట్ కాలేదనే చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఆఫర్ల విషయంలో మృణాల్ కొంత ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అల్లు అర్జున్ రాకా చిత్రంలో ఆమె నటిస్తున్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, మీడియా ప్రశ్నించినా ఆమె ఈ విషయాన్ని నేరుగా ధృవీకరించడం లేదు. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడకూడదన్న నిబంధన కారణంగానే ఆమె స్పందించడం లేదని సమాచారం. మరోవైపు బాలీవుడ్‌లో 2026 ఆమెకు అంతగా కలిసి రాలేదనే చెప్పాలి. 'దో దివానే షెహర్ మే', 'హే జవానీతో ఇష్క్ హోనా హై' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా కొట్టాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'పూజా మేరీ జాన్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైనప్పటికీ సోషల్ మీడియాలో పెద్దగా సౌండ్ చేయలేదు. మొత్తంగా ఉన్నంతలో 'డెకాయిట్' ఒక్కటే ఆమెకు కొంత ఊరటనిచ్చింది. ఇక కథ ప్రకారం 'కల్కి 2'లోనూ ఆమె పాత్ర ఉండాల్సి ఉండగా, దర్శకుడు నాగ్ అశ్విన్ ఏలాంటి మార్పులు చేస్తారనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.



# దర్శకుడి అసభ్య ప్రతిపాదన..

### నటి నీతి టేలర్ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** సినీ పరిశ్రమలో అవకాశాల పేరుతో కొత్తగా వచ్చే నటీనటులకు ఎదురవుతున్న అనుచిత ప్రతిపాదనలపై బుల్లితెర నటి నీతి టేలర్ సంచలన విషయాలను బయటపెట్టారు. తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదురైన ఓ చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండో సినిమా అవకాశం కోసం ఓ దర్శకుడు తనకు అసభ్యకరమైన షరతు విధించాడని ఆవేదన వ్యక్తం చేశారు. టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నీతి టేలర్, దక్షిణాదిలో తొలి సినిమా పూర్తి చేసిన తర్వాత మరో చిత్రంలో అవకాశం కల్పిస్తానంటూ సదరు దర్శకుడు సంప్రదించాడని తెలిపారు. అయితే ఆ సినిమాలో అవకాశం కావాలంటే తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని షరతు పెట్టడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్నానని, ఆ సమయంలో తల్లి ఇచ్చిన ధైర్యంతో ఆ దర్శకుడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సినిమాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవడంతో మనస్తాపానికి గురై, తిరిగి టెలివిజన్ రంగంపైనే దృష్టి సారించినట్లు నీతి టేలర్ వివరించారు.



# 'బ్రహ్మముడి' రుద్రాణి అసలు లుక్కు చూశారా?

**హైదరాబాద్, అక్టోబరు 13 (స్పంద న్యూస్):** బుల్లితెరపై నటీనటులు పోషించే పాత్రలు ప్రేక్షకులకు ఎంతో దగ్గరవుతుంటాయి. ముఖ్యంగా ధారావాహికల్లో ప్రతినాయకులుగా కనిపించే నటీనటులు తమ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వారిలో నటి షర్మిత గౌడ ఒకరు. తెలుగులో ప్రసారమవుతున్న 'బ్రహ్మముడి' ధారావాహికలో రుద్రాణి పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. తెరపై గంభీరంగా, ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించే ఈమె.. నిజ జీవితంలో మాత్రం ఆధునిక దుస్తులు, ఆకర్షణీయమైన ఫొటోషూట్లతో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నారు. 'బ్రహ్మముడి' ధారావాహికను క్రమం తప్పకుండా చూసేవారికి షర్మిత గౌడ పేరు సుపరిచితమే. ఇందులో రుద్రాణి పాత్రలో కనిపిస్తూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగిన హావభావాలు, సంభాషణలు పలికే తీరు ద్వారా కథలో తన పాత్రకు ప్రత్యేకతను తీసుకొస్తున్నారు. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలో చూపించే గంభీరత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ధారావాహికలో సంప్రదాయబద్ధంగా, గంభీరంగా కనిపించే షర్మిత గౌడ.. వ్యక్తిగత ఫొటోల్లో మాత్రం భిన్నమైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆధునిక దుస్తులు, కొత్త తరహా అలంకరణలు, అందమైన ఫొటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెరపై రుద్రాణిగా కనిపించే రూపానికి, సామాజిక మాధ్యమాల్లో పంచుకునే చిత్రాల్లోని రూపానికి మధ్య ఉన్న వ్యత్యాసం నెటిజన్లను ఆకర్షిస్తోంది. దీంతో ఆమె తాజా చిత్రాలు అభిమానుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. షర్మిత గౌడ నటనా ప్రయాణం కన్నడ టెలివిజన్ రంగంలో ప్రారంభమైనట్లు సమాచారం. అక్కడ పలు ధారావాహికల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'గీత' ధారావాహికలో కథానాయకుడి తల్లి పాత్రలో కనిపించి కన్నడ ప్రేక్షకులకు చేరువైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి. కుటుంబ కథా ధారావాహికల్లో విభిన్న పాత్రలు పోషించిన ఆమె.. తెలుగులో మాత్రం ప్రతికూల ఛాయలున్న రుద్రాణి పాత్రతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇక షర్మిత వ్యక్తిగత జీవితం, కుటుంబ వివరాల గురించి తెలుసుకోవడానికి కూడా అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఆమె వయసు, పుట్టిన తేదీ వంటి వివరాలపై స్పష్టమైన ధ్రువీకరణ లేని సమాచారాన్ని నిజమని భావించకూడదు. ఏదేమైనా, తెరపై పాత్రకు తగ్గట్టుగా నటిస్తూ, బయట తనదైన శైలితో అభిమానులను ఆకట్టుకుంటున్న షర్మిత గౌడ బుల్లితెర ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

# శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

### జగనన్న కాలనీ మూలపాలెం లేఅవుట్‌లో దసరా ఉత్సవాలు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



బాపట్ల, అక్టోబర్ 13 (స్పంద న్యూస్): బాపట్ల పట్టణంలోని జగనన్న కాలనీ, మూలపాలెం లేఅవుట్‌లో అమ్మవారి దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలో మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి సమస్త జీవులకు అన్నాన్ని ప్రసాదించే తల్లిగా భక్తులచే పూజలందుకుంటారు. ఆకలి తీర్చి, ప్రజలకు సుఖసంతోషాలు, సిరిసంపదలు ప్రసాదించే తల్లిగా అమ్మవారిని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పూజలు చేసి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శించుకునే అవకాశం లభించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీ, మూలపాలెం లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దసరా ఉత్సవాలు రానున్న రోజుల్లోనూ మరింత వైభవంగా కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు.

# గుంటూరు ఛానల్ పొడిగింపు

### నల్లమడ ఆధునీకరణ పనులు పూర్తయినప్పుడే రామన్‌కు నిజమైన నివాళి.



పెదనందిపాడు అక్టోబర్ 13 (స్పంద న్యూస్)నల్లమడ రైతు సంఘం నాయకులు గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పోరాట యోధుడు కామ్రేడ్ కొల్లా రామన్ ప్రధమ వర్ధంతి మంగళవారం సాయంత్రం పెదనందిపాడు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభకు నల్లమడ రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు మాట్లాడుతూ .కామ్రేడ్ కొల్లా వెంకయ్య ఆశయాలకు అనుగుణంగా రామన్ రైతు సమస్యలపై ప్రజా సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. నల్లమడ ఆధునికరణకు జరిగిన ఉద్యమంలోనూ, గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష మేరకు జరిగిన ఉద్యమంలో తుది శ్వాస వరకు కృషి చేశారని అన్నారు. నల్లమడ ఆధునీకరణ, గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పనులు పూర్తి అయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పుడే రామన్ కు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు మన్నవ హరి ప్రసాద్, లావు అంకమ్మ చౌదరి, పోపూరి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు కొల్లా వెంకటేశ్వర్లు స్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ పర్చూరు., సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, లావు వెంకట సుబ్బారావు.పి. మస్తాన్, తులసి తదితరులు మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో డాక్టర్ హేమంతీ దేవి, డాక్టర్ కొల్లా అమర్, కొల్లా నిర్మల, కొల్లా పవన్, ముప్వా పెద్దన్న, చాగంటి రమేష్, బోడావుల హనుమంతరావు, కొల్లా వెంకయ్య చౌదరి, ఈదర భ్రమరాంబ, కాపు సాంబశివరావు, సామ్రాజ్యం, తుమ్మల సరళ. గ్రంథాలయ నిర్వాహకురాలు ఏ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలి

### : తహశీల్దార్ వర కుమార్ రేషన్ డీలర్ల వినతి



దుర్గి అక్టోబర్ 13 ( స్పంద న్యూస్ ) రేషన్ సరుకుల బస్తాలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర సాంకేతిక సమస్యలు, పనిభారం ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దుర్గి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ వర కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీలర్ల ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సమస్యల వల్ల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం తీవ్ర ఇబ్బందిగా మారిందని, దీనివల్ల సరుకుల పంపిణీ ఆలస్యమవడమే కాకుండా లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక ఇబ్బందులకు కారణమవుతున్న నూతన క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ను పూర్తిగా తొలగించాలని మరియు ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా డీలర్ల జీవనభృతిని దృష్టిలో ఉంచుకుని కమిషన్‌ను పెంచాలని, పంపిణీ సమయంలో ఎదురవుతున్న సర్వర్, సాంకేతిక లోపాలను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విధానాన్ని మార్చకపోతే భవిష్యత్తులో పంపిణీ ప్రక్రియ మరింత క్లిష్టంగా మారుతుందని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వర కుమార్, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు, స్థానిక డీలర్లు పాల్గొన్నారు.

# విద్యార్థినులు శక్తియాపై అవగాహన కలిగి ఉండాలి

### ఎస్సై రాజ్యలక్ష్మి



చీరాల అక్టోబర్ 13 ( స్పంద న్యూస్ ) విద్యార్థినిలు, మహిళలు శక్తి యాప్ పై అవగాహన కలిగి ఉండాలని ఒకటవ పట్టణ ఎస్సై రాజ్యలక్ష్మి సూచించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, డిఎస్పి మోయిన్, ఒకటో పట్టణ సీఐ సోమశేఖర్ సూచనలతో శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైస్ ఇన్స్టిట్యూట్ నందు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. సబ్ డివిజన్ శక్తి బృందం కానిస్టేబుల్ కే. సుబ్బారావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శక్తి యాప్ గురించి వివరిస్తూ ఈ యొక్క యాప్ అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు,ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు అరికట్టే విధంగా యాప్ ఉపయోగపడుతుందని వివరించడం జరిగింది. అలానే రోజురోజుకు పెరుగుతున్నటువంటి సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియాలో ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ లలో వచ్చే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తమై హెల్ప్ లైన్ నెంబర్లు 100, 112, 181,1091,1098 కు కాల్ చేసిన ఎడల వెంటనే చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే ఫోక్సో చట్టంపై అనగా చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల చట్టం గురించి మరియు మహిళల రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన కల్పించారు. ఈనాటి కార్యక్రమంలో శక్తి బృందం మరియు ఇన్స్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు పై బైండోవర్ నమోదు చేయండి:ఎస్పీ జగదీష్



దుర్గి అక్టోబర్ 13 ( స్పంద న్యూస్) మండలంలో రౌడీ షీటర్ల పై ముందస్తుగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదాహల్లి పోలీసులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన దుర్గి పోలీస్ స్టేషను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సిబ్బంది ఎంతమంది ఉన్నారు వారి వివరాలను కనుక్కొని ఎవరెవరు ఏ విధులను చేస్తున్నారు అని ఆరా తీశారు. అనంతరం స్టేషన్ ను పరిశీలించి వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. రౌడీ షీటర్లు ఫ్యాక్షనిస్టులపై పోలీసులు ఉక్కు పాదం మోపి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎన్నికల సమయంలో చిన్న గొడవలు జరిగిన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల వివరాలను తెలుసుకొని వాటిపై డేగకన్ను వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గురజాల డిఎస్పి మహేశ్వరరావు, కారంపూడి సిఐ భాస్కర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి: సీఎస్ జి. సాయి ప్రసాద్



గుంటూరు, అక్టోబర్ 13 (స్పంద న్యూస్ ): స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ప్రకటించిన స్థానాల రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియలోని ప్రతి అంశాన్ని సమన్వయంతో జాగ్రత్తగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజావలి, జడ్పీ సీఈవో వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణదారుల సమస్యలు పరిష్కరించాలి.



కర్లపాలెం అక్టోబర్ 13 స్పంద న్యూస్: చౌక ధరల డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని చౌక ధరల డీలర్ల జిల్లా అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు .కర్లపాలెం రెవిన్యూ కార్యాలయంలో చౌక ధరల దుకాణాల రాష్ట్ర అధ్యక్షులు లీలా మాధవరావు పిలుపుతో డీలర్ల సమస్యల అర్జీలను మండల డీలర్లు తహసిల్దార్ రవీంద్ర కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశములు ప్రకారం ప్రవేశపెట్టిన బియ్యం బస్తాలపై క్యూ ఆర్ స్కాన్ చేసే విధానమును వికలాంగులు వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తాత్కాలికంగా నిలుపుదల చేసి అధునాతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ పరికరాలను డీలర్లకు అందుబాటులోకి తెచ్చిన తర్వాత అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎం డి యు వాహనదారుల సహాయకులకు ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రతి డీలర్ కు సేవా రుసుము కింద 5000 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌక డిపో డీలర్లు మందపాటి పరమానంద కుమార్ , అట్ల గిరిబాబు రెడ్డి ,యానాది ,ఎస్ శ్రీనివాసరావు ,కృష్ణంరాజు ,పిట్టు వెంకటరెడ్డి ,అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కర్లపాలెం లో నూతన రెడ్ క్రాస్ కమిటీ ఏర్పాటు

### తహసీల్దార్ రవీంద్ర



కర్లపాలెం అక్టోబర్ 13 స్పంద న్యూస్ : 2026 -29 సంవత్సరాలకు గాను కర్లపాలెం మండలం లో నూతన రెడ్ క్రాస్ కమిటీ ఏర్పడినట్లుగా కర్లపాలెం తహసీల్దార్ డి రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతన కమిటీని బాపట్ల రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ నారాయణభట్టు సమక్షంలో తహసీల్దార్ రవీంద్ర కుమార్ అధ్యక్షతన కమిటీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ చైర్మన్ గా ఇనకొల్లు పోలీసురావు, వైస్ చైర్మన్‌గా తూనుగుంట్ల లలిత బాబు, కోశాధికారిగా ఎం పరమానంద కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గా ఆట్ల రవికుమార్ రెడ్డి, ఎస్ శ్రీనివాసరావు, ఎన్. కళాధర్, ఎం బాలాజీ, బి జీవన్, యు .నరసింహారావు, పి ఆంజనేయులు, మహిళా సభ్యులుగా బి. పద్మ కుమారి. ఎంపికైనట్లు తెలిపారు. నూతన చైర్మన్ పోలీసురావు మాట్లాడుతూ చైర్మన్గా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ తనవంతు తాను సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ బి.రామ సుబ్బారావు, కోశాధికారి టి ప్రసాద్ రెడ్డి, రమణ బాబు, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, బి విజయకుమార్, బుర్ల రాజేష్,ఏకశిరి నరసింహారావు, యానం చిన్నబ్బాయి, వై.గుడారంకయ్య, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణ మహాదేవిగా దర్శనమిచ్చిన బగళాముఖి అమ్మవారు

పీవీ పాలెం అక్టోబర్ 13 (స్పంద న్యూస్) చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో వైభవముగా జరుగుతున్న శ్రీ శరత్కాల షోడశ యజ్ఞకార్యక్రమాలలో మూడవరోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు ఈరోజు ప్రధాన ఉభయ దాతలుగా తాత శివశంకరరావు దంపతులు చెరుకుపల్లి వీరు ఈరోజు కార్యక్రమాలలో ప్రధాన భూమిక వహించారని వచ్చిన భక్తకోటికి అన్నదానము రాత్రి ప్రసాదములు అల్పాహార వితరణ ఏర్పాట్లు చేశామని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి ఈవో ఈ నరసింహమూర్తి తెలియ పరిచారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 14 అక్టోబర్ 2026

## నేడు అన్నపూర్ణాదేవిగా కొలువైన అమ్మవారు



యడ్లపాడు,అక్టోబర్14(స్పందన్యూస్ ): యడ్లపాడు మండలంలో విజయదశమి శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా జగన్మాతను రోజుకో రూపంలో అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో నవరాత్రి ఉత్సవాల్లో మూడోరోజు మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.బోయపాలెంలోని శ్రీపార్వతీదేవి ఆలయం, హరిహరక్షేత్రం, యడ్లపాడు శివాలయం, కాటి అంకమ్మతల్లి ఆలయాల్లో అమ్మవారిని శాకంబరీ అన్నపూర్ణాదేవిగా అలరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే లింగారావుపాలెంలోని అమ్మవారు శ్రీవైష్ణవీదేవి అలంకారంలో కొలువుదీరారు. సొలస గ్రామంలోని బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో దుర్గాదేవి అమ్మవారికి అన్నపూర్ణాదేవిగా విశేష అలంకరణలు నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. నవరాత్రి ఉత్సవాలతో ఆలయ ప్రాంగణాలు భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## పిడుగురాళ్లలో పోలీసుల భారీ కవాతు

**-స్థానిక ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు.**

**- సోషల్ మీడియాపై నిరంతర నిఘా**



దాచేపల్లి,పిడుగురాళ్ల, అక్టోబర్ 13 (స్పంద న్యూస్ ): స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం పోలీసులు భారీ కవాతు నిర్వహించారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ వెంకట్రావు ఏఎన్ఎస్ పోలీసులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో కవాతు చేపట్టారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతోందని సీఐ వెంకట్రావు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ధ్రువీకరించని వార్తలను ఇతరులకు పంపవద్దని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే పోస్టులు, సందేశాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచినట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్లపై ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని గుర్తుంచుకోవాలని సూచించారు.స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిఐ వెంకట్రావు కోరారు.కవాతు లో స్థానిక పోలీసులతో పాటు ఎ ఎన్ ఎస్ పోలీసులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణ దేవి అమ్మవారి అవతారం





బాపట్ల అక్టోబర్ 13 (స్పంద న్యూస్) ఈరోజు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మూడవరోజు శ్రీ అన్నపూర్ణాదేవి అమ్మవారి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఉభయ దాతలు ఆత్మకూరి శ్రీనివాసరాజు వెంకట రేణుక కొక్కిరిగడ్డ సుబ్బారావు పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం అమ్మవారికి విశేష పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. తదనంతరం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయని సూర్యలంక శివ క్షేత్రం ఆలయ పూజారి అద్దేపల్లి శ్రీనివాస్ శర్మ తెలిపారు.

**తెనాలి, అక్టోబర్13(స్పంద న్యూస్)** స్థానిక గంగానంపేటలోని శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠంలో వాసవి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ స్వయం పర్యవేక్షణలో శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.

# కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి

**జగన్మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తమిళనాడు సీఎం**

**వేదాశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు.**

**సంప్రదాయ వస్త్రధారణతో విచ్చేసి భక్తులకు చేతులెత్తి అభివాదం చేసిన ముఖ్యమంత్రి**

ఇంద్రకీలాద్రి అక్టోబర్ 13 ( స్పంద న్యూస్ )

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గౌరవ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం సాయంత్రం ఇంద్ర కీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.ఇంద్రకీలాద్రికి విచ్చేసిన తమిళనాడు ముఖ్య మంత్రికి ఆలయ అర్చకులు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని ), మంత్రి పి.నారాయణ తదితరులు, ఆలయ అధికారులు సాంప్రదాయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకున్న ఆయన, క్యూలైన్లలో ఉన్న భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేశారు.

అనంతరం అంతరాలయంలో శ్రీ అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు.?దర్శనానంతరం అనివేటి మండపం లో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, దేవాదాయ శాఖ



కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధి కారి వి.కె. శీనా నాయక్ సంయుక్తంగా తమిళనాడు ముఖ్యమంత్రికి శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు మరియు దివ్య చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యు లు, ఆలయ అధికారులు, నగర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఎక్కడ చంద్రబాబూ?

**మాటలు కాదు.. శ్వేతపత్రం విడుదల చేయాలి**

**బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంఠి నాగరాజు**

పెడన, అక్టోబర్ 13 (స్పంద న్యూస్):బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆ హామీని ఎలా అమలు చేస్తుందో స్పష్టంగా వెల్లడించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర చైర్మన్ శౌంఠి నాగరాజు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన చట్టపరమైన కార్యాచరణ, న్యాయపరమైన అడ్డంకులను అధిగమించే మార్గాలు, భవిష్యత్ ఎన్నికల్లో అనుసరించనున్న విధానంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.బీసీలను ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి రాజకీయ ప్రాతినిధ్యంపై స్పష్టత ఇవ్వకపోవడం సరైంది కాదని నాగరాజు విమర్శించారు. బీసీలు వెనుకబడిన వర్గాలు కాదని, సమాజానికి వెన్నెముక వంటి వారని ప్రకటించే నాయకులు, వారి రాజకీయ హక్కుల పరిరక్షణలోనూ అదే చిత్తశుద్ధిని చూపించాలని అన్నారు.

చంద్రబాబు నాయుడు గతంలో బీసీలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, 34 శాతం రిజర్వేషన్లను ఏ చట్టపరమైన విధానం ద్వారా అమలు చేస్తారు? ఏ ఎన్నికల నుంచి అమలు చేయనున్నారు? రిజర్వేషన్లకు న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లకు సంబంధించిన వివాదాల కారణంగా సుమారు 18 వేల మంది బీసీ ప్రజాప్రతినిధుల పదవులపై ముప్పు ఏర్పడిందనే ఆందోళనల నేపథ్యంలో, వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వం స్పష్టమైన



వివరాలు వెల్లడించాలని కోరారు.అమరావతిపై ఉన్న చొరవ బీసీ రిజర్వేషన్లపై ఎందుకు లేదు?అమరావతి రాజధాని అంశంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్న ప్రభుత్వం, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించే విషయంలోనూ అదే స్థాయిలో చొరవ చూపాలని నాగరాజు అన్నారు. రాజధాని అంశంపై కేంద్రంతో సమన్వయం చేసుకోగలిగినప్పుడు, బీసీ రిజర్వేషన్ల సమస్యకు రాజ్యాంగబద్ధమైన పరిష్కారం కనుగొనేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వంతో టీడీపీకి ఉన్న రాజకీయ సంబంధాలను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. బీసీల రాజకీయ హక్కుల పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, సాధ్యమైన పరిష్కారాలపై ప్రజలకు వివరించాలని కోరారు.

### తమిళనాడు తరహా రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ల విధానాన్ని ప్రస్తావించిన నాగరాజు, అక్కడి అనుభవాలను పరిశీలించి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఎలా కల్పించవచ్చో ప్రభుత్వం వివరించాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య రాజ్యాంగపరమైన, చట్టపరమైన పరిస్థితుల్లో ఉన్న తేడాలను పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రానికి వర్తించే మార్గాన్ని చూపించాలని అన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడం మాత్రమే సరిపోదని, వార్డు సభ్యుల నుంచి మున్సిపల్ కౌన్సిలర్ల వరకు స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు అనుసరించనున్న విధానాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను ప్రజల ముందుంచాలని పేర్కొన్నారు.

### హామీలు కాదు.. హక్కులకు భరోసా కావాలి

బీసీలకు పదవులు, అధికారంలో భాగస్వామ్యం, రాజకీయ నిర్ణయాల్లో తగిన ప్రాధాన్యం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని నాగరాజు అన్నారు. బీసీల హక్కుల విషయంలో మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో ఫలితాలు చూపించాలని చంద్రబాబు నాయుడిని కోరారు. ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల అమలుపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, చట్టపరమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

బీసీలు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వర్గం కాదని, రాష్ట్ర నిర్మాణంలో కీలక భాగస్వాములని పేర్కొన్న నాగరాజు, వారి హక్కులను హామీలతో కాకుండా రాజ్యాంగబద్ధమైన చర్యలతో గౌరవించాలని స్పష్టం చేశారు.

# చీరాల చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు కేటాయింపు

**ఆనందం వ్యక్తం చేస్తున్న ఎస్సీ వర్గాల నాయకులు ప్రజలు**

**నిస్తేజం లో చైర్మన్ ఆశించిన ఓసి, బిసి వర్గాల నాయకులు**

**అభ్యర్థుల ఎంపికలో తలమునకలైన కూటమి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు**

చీరాల అక్టోబర్ 13 ( స్పంద న్యూస్ )

జరగనున్న మునిసిపాలిటీ ఎన్నికలలో పార్టీలు ప్రజల అంచనాలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం చీరాల చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు కేటాయించడం జరిగింది. పుర సమరంలో జరిగిన ఈ అనూహ్య పరిణామంతో ఎస్సీ వర్గాల నాయకులు, ప్రజలు ఒకింత ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఎంతోకాలంగా చైర్మన్ పీఠం కోసం ఎదురుచూస్తున్నా ఓసి మరియు బిసి వర్గాలకు చెందిన నాయకుల ఆశలు అడియాసలయ్యాయని చెప్పవచ్చు. ఎవరు ఊహించని విధంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చైర్మన్ అభ్యర్థి ఎంపిక మూడు పార్టీలకు సవాలుగా మారింది. ముఖ్యంగా పట్టణంలో అధికార టిడిపికి ఎస్సీ మహిళా సామాజిక వర్గం నాయకత్వం తక్కువ కావడంతో అభ్యర్థి ఎంపిక కత్తి మీద సాముల మారిందని పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. చీరాల మున్సిపాలిటీలో సాధారణంగా ఎస్సీ సామాజిక వర్గ నాయకత్వం మొదటి నుండి కాంగ్రెస్ వైపు ఉంటూ వచ్చింది. అటు తరువాత కాలంలో వైసిపికి అనుకూలంగా మారిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో చైర్మన్ అభ్యర్థి ఎంపిక వైసీపీకి కొంత సులువుగా ఉంటుందని చెప్పకనే చెప్పవచ్చు. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే ఆ పార్టీకి ఎస్సీ సామాజిక వర్గంలో పట్టు ఉన్నప్పటికీ చైర్మన్ అభ్యర్థి ఎంపిక అంత తేలిక కాదనే వాదన వినిపిస్తుంది. ఇంతకాలం చైర్మన్ సీటు కోసం పట్టణంలో ఎంతోమంది ఓసి, బిసి వర్గాల నాయకులు ఆయా పార్టీల అధిష్టానంతో పోటీ పడడం జరిగింది. ముఖ్యంగా అధికార టిడిపిలో ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్యను ఎంతోమంది నాయకులు పలుమార్లు కలసి తమకు చైర్మన్ అవకాశం కల్పించాలని ఒకరికొకరు పోటీ పడిన సంగతి పుర ప్రజలకు తెలిసిన విషయమే. ఇప్పటికే అధికార టిడిపి, వైసిపి మరియు కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థి ఎంపిక విషయమై తమదైన శైలిలో ప్రయత్నాలు ప్రారంభించాయి. పార్టీలకు అభ్యర్థుల ఎంపిక తోపాటు ఎన్నికల ఖర్చు కూడా ఓ సమస్య కావడంతో పార్టీలు అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఆర్థిక అండ బలం కలిగిన అభ్యర్థిని ఎంపిక చేసి ఎలాగైనా మునిసిపాలిటీ తమ ఖాతాలో వేసుకోవాలని మూడు పార్టీలు అడుగులు వేస్తున్నాయి. ఏది ఏమైనా చీరాలలో అభ్యర్థి ఎంపికను బట్టి విజయం కూడా అంచనా వేయవచ్చని పుర ప్రజలు చర్చించుకోవడం విశేషం. మరి పార్టీలు అభ్యర్థుల ఎంపిక ఏ ప్రాతిపదికన ఎంపిక ఇంకోద్ధి రోజులు వేచి చూద్దాం!

## దేశం గెలుస్తుంది క్షయ వ్యాధి ఓడిపోతుంది.

**రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. చైతన్య**

తెనాలి, అక్టోబర్13(స్పంద న్యూస్)టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైల్వే హాస్పటల్ నందు, రైల్వే స్టేషన్ లో హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే మిషన్ ద్వారా రైల్వే హాస్పిటల్ కు వచ్చిన ప్రజలకు, రైల్వే స్టేషన్ లో పనిచేస్తున్న వెండర్స్ మరియు సాని టేషన్ వర్కర్స్ ఛాతీ ఎక్సరే కార్యక్రమం నిర్వహించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెనాలి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ టి. వి.రమణ రైల్వే సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.చైతన్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఉచిత చాతీ ఎక్సరే ద్వారా నిద్రావస్తలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి,తగిన ట్రీట్మెంట్ ఇవ్వటం వలన క్షయ వ్యాధిని పూర్తిగా అంతం చేయవచ్చని తద్వారా దేశం గెలుస్తుంది క్షయ వ్యాధి ఓడిపోతుందని అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రైల్వే హెల్త్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ సింగ్, రైల్వే హాస్పిటల్ వైద్య సిబ్బంది తెనాలి టీబీ యూనిట్ సిబ్బంది లక్ష్మి, దిలీప్, భార్గవి ఆశా కార్యకర్త మల్లేశ్వరి, రైల్వే వెండర్స్ రైల్వే శానిటేషన్ వర్కర్స్ రైల్వే ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.



## 8 వ ప్రపంచ సాహితీ మహోత్సవంకు తెనాలి కవులు కళాకారులు

తెనాలి,అక్టోబర్13(స్పంద న్యూస్) తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ ప్రపంచ సాహితీ మహోత్సవం 177వ కార్యక్రమానికి తెనాలికి చెందిన ప్రముఖ కవి, సాహితీబంధువు డాక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)కి కవిసమ్మేళనంలో కవితా గానం, పద్యకవి విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్ పద్యపఠనం, రంగస్థల నటుడు వినుకొండ శ్రీరామ్మూర్తి ఏక పాత్రాభినయం, నటుడు, కళాకారుడు దేవిశెట్టి కృష్ణారావు కవితా పఠనానికి ఆహ్వానం అందుకున్నారు.

2026 నవంబర్ 01వ తేదీ, ఆదివారం ఉదయం 7 గంటల నుండి ధవళేశ్వరం, రాజమహేంద్రవరం రూరల్, తూర్పుగోదావరి జిల్లాలోని గౌతమి సదన్ ఆడిటోరియంలో జరగనున్న ఈ మహోత్సవంలో ప్రపంచ తెలుగు కవిసమ్మేళనం, సాహిత్య సదస్సులు, పుస్తకావిష్కరణలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద కళారూపాలు నిర్వహించనున్నారు. ప్రముఖ కవి, రచయిత,కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్ సారథ్యంలో జరగనున్న ఈ మహోత్సవానికి దేశ విదేశాలకు చెందిన ప్రముఖ కవులు, సాహితీవేత్తలు హాజరుకానున్నారు. తెనాలి నుంచి ఈ నలుగురు కి ఆహ్వానం అందడం పట్ల తెనాలి సాహితీ మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

